

అస్సాగో ఫ్యాక్టరీ మూసివేయండి 9



మద్యమే.. మార్గంగా!

వైసీపీ రహస్య సిండికేట్

- కూటమితో జతకట్టిన ఫ్యాన్
- మద్యం దుకాణాల్లో బినామీలు
- జనసేన ముసుగులో లాటరీ
- ఇప్పుడిప్పుడే బయటకు..
- కూటమిలో కుమ్ములాటలు
- జిల్లాలో సీనియర్ల అసంతృప్తి
- నాయకులకు సర్దుపాట్లు

(రాజమహేంద్రవరం/సిటీ-ఆంధ్రజ్యోతి)

కూటమి కింద మెల్లమెల్లగా ఫ్యాన్ రెక్కలు చేరుతున్నాయి.. కొంత మంది అడ్డదారులు వెతుక్కుంటుంటే..మరికొంత మంది మాత్రం డైరెక్ట్‌గా కూటమి నాయకుల పంచన చేరుతున్నారు. దీనికి మద్యం వ్యాపారమే మార్గంగా ఎంచుకున్నారు.జిల్లాలోని 125 మద్యం షాపులను నోటిఫై చేయగా ఏకంగా 4,384 దరఖాస్తులు అందాయి. కొందరు కలిపి సిండికేట్‌గా కూడుకొని వందల్లో దరఖాస్తులు సమర్పించారు. లాటరీ ద్వారా షాపులు కేటాయించారు.అయితే వైసీపీ నాయకులు కొందరు బినామీలతో దరఖాస్తు చేయించారు. నేరుగా వైసీపీ నాయకులు పాల్గొంటే ఇబ్బందులెదురవుతాయని ఊహించి దొడ్డిదారిన చక్కబెట్టారు. దీనికి కొందరు టీడీపీ, జనసేన నాయకులను వాడుకొన్నారని తెలుస్తోంది. దరఖాస్తులు బినామీల పేరున సమర్పించి వైసీపీ నాయకులు దరఖాస్తు ఫీజు సమకూర్చినట్టు చెబుతున్నారు.షాపులు వచ్చిన తర్వాత తెరపైన టీడీపీ,జనసేన నాయకులు కనిపించినా.. తెర వెనుక కొందరు లోపాయికారిగా వైసీపీకి సహకారం అందించి వ్యాపారంలో వాటాలు ఇస్తున్నా రనే చర్చ నడుస్తోంది. కూటమి నాయకుల మధ్య చిచ్చు పెట్టి వ్యాపారం పూర్తిగా వైసీపీ నాయకులు చేతిలో పెట్టుకొనే విధంగా పావులు కదుపుతున్నట్టు సమాచారం.

బినామీలు.. వైసీపీ నాయకులే!

నిడదవోలులోని మద్యం సిండికేట్‌కి ఓ వైసీపీ నాయకుడు సారథ్యం వహిస్తున్నారు.ఈయన కనుసన్నల్లోనే వ్యాపారం జరుగుతోంది. రాజమహేంద్రవరం పేపర్‌మిల్, గోరక్షణపేట ఏరియాల్లోని 6, 20 మద్యం దుకాణాల్లో మాజీ ఎంపీ భరత్‌రామ్ బినామీల ద్వారా పెట్టుబడి పెట్టడంపై సిండికేట్‌లో రగడ మొదలైంది. సిండికేట్‌లో ఉన్న ఇద్దరి ద్వారా ఇతర సభ్యులకు తెలియకుండా రహస్యంగా పెట్టుబడి పెట్టారు. షాపులు తెరిచి అమ్మకాలు ప్రారంభించిన తర్వాత ఈ విషయం ఇతర సభ్యులకు తెలియడంతో సిండికేట్‌లో ఆ ఇద్దరి వ్యవహారంపై చిచ్చు రగులుకొంది. నగరం పరిధిలోని 28 షాపులకు సిండికేట్లకు 16 దక్కాయి. వీటిని స్థానిక, స్థానికేతరులు వాటాలు వేసుకున్నారు. సిండికేట్‌లో లేకుండా లాటరీలో విజయం సాధించిన వాళ్లను ఇప్పటికే వైసీపీ దువ్వేసింది. స్థానికేతరులకు సిండికేట్ కంటే ఎక్కువగా సొమ్ములు ఆఫర్ చేయడం ద్వారా షాపులను దక్కించుకొందని తెలుస్తోంది. కొవ్వూరు రూరల్‌లోని కూడా మద్యం షాపుల్లో వైసీపీ నాయకుల పెట్టుబడులు ఉన్నాయని చెబుతున్నారు. కొవ్వూరు టౌన్‌లోని ఓ బార్ వైసీపీ నాయకుడే నడుపుతున్నారు. అలాగే మిగతా నియోజకవర్గాల్లో కూడా మద్యం వ్యాపారంలో జనసేన నాయకుల ముసుగులో వైసీపీ నాయకులు ఉన్నారని సమాచారం.

రహస్యంగా పెట్టుబడులు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో వైసీపీ నాయకులే మద్యం వ్యాపారం వెలగబెట్టారు. దాడులు, బెదిరింపులకు దిగి ఏకంగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం తయారీ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, నాసిరకం మద్యాన్ని ఏరులై పారించారు.ఈ విధంగా ఐదేళ్లపాటు టీడీపీ, జనసేన నాయకులను ఆర్థికంగా విపరీతంగా కష్టాలు పెట్టారు. దీంతో ఇప్పుడు వైసీపీ నాయకులు మద్యం వ్యాపారంలో రహస్యంగా పెట్టుబడులు పెట్టడం కూటమి నాయకులు కొందరు కమీషన్లకు ఆశ పడి లోపాయికారిగా లొంగిపోవడంపై మిగతా నాయకులు మండిపడుతున్నారు.ఈ క్రమంలో షాపులు తెరుచుకొన్న కొద్ది రోజులకే సిండికేట్లలో వైసీపీ నాయకుల వల్ల గొడవలు ఆరంభమయ్యాయి. వైసీపీ నాయకులు బినామీలతో దరఖాస్తులు సమర్పించిన వాటిలో కొన్నిటికి దుకాణాలు దక్కడంపై కూడా వాగ్వాదాలు జరుగుతున్నాయి.

కూటమిలో కుమ్ములాటలు

కూటమిలోని టీడీపీ, జనసేన నాయకుల మధ్య మద్యం వ్యాపారం విషయంలో కుమ్ములాటలు రచ్చకెక్కుతున్నాయి. వీరిలో వైసీపీకి తెరవెనుక కొమ్ముకాసే కొందరు నాయకులు టీడీపీ, జనసేన ముసుగు వేసుకొని వ్యవహారం నడిపిస్తున్నారు. సీతానగరం మండలంలోని సీతానగరం, చినకొండేపూడిలో రెండు చోట్ల టీడీపీకి చెందిన వారికి షాపులు వచ్చాయి. వాటిలో వ్యాపారం మొదలు పెట్టారు. గురువారం రాత్రి కొందరు జనసేన పార్టీకి చెందిన వాళ్లు ఆ మద్యం దుకాణాల్లో తమకు 25 శాతం వాటా ఇవ్వాలని వాదనకు దిగారు. మద్యం విక్రయాలు ఆపేస్తామంటూ షాపు షట్టర్లను దించేశారు. తర్వాత జనసేన ప్రతినిధి కల్పించుకొని సర్దుబాటు చేసినట్టు చెబుతున్నారు.కాసేపటి తర్వాత మద్యం అమ్మకాలు మొదలయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో ఓ ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో 'వాసి' చక్క బెట్టగా.. 'మజ్జి'లో ఓ మహిళా నాయకురాలు కీరోల్ పోషించిందని అంటున్నారు. రూరల్ పరిధిలోని రెండు మండలాలు, సిటీలోని రూరల్ వార్డుల్లో చక్రం తిప్పి కూటమికి చెందిన నాయకులతో పాటు వారి అనుచరులకు బాగా కలిసొచ్చేలా చేశారు. ఇక్కడ కూడా సిండికేట్ వ్యవహారం బాగా నడిచింది.అయితే ముందు నుంచీ పార్టీని నమ్ముకొని ఉన్న కొందరికి తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో అసంతృప్తి నెలకొంది.పంచాయితీలు సర్దుబాటు చేయలేక నాయకులు తలలు పట్టు కుంటున్నారు.తమను విమర్శిస్తూనే తమకు రహస్యంగా అనుకూలంగా వ్యవ హరించాలని వైసీపీ నాయకులు బేరం మొదలుపెట్టినట్టు చర్చ నడుస్తోంది.ఈ నియోజకవర్గం లో కొందరికే సదరు ప్రజా ప్రతినిధి ప్రాధాన్యం ఇస్తారనే వాదన ముందు నుంచీ ఉంది. సిండికేట్‌లో వైసీపీ నాయకుల పెట్టుబడులపై చూసీ చూడకుండా వదిలేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ఆఫ్‌లైన్‌లోనూ.. ఇసుక



ఇసుక కొరత రానీయవద్దు

- నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో సరఫరా
- ఓపెన్ ర్యాంపులు తెరవండి
- ర్యాంపుల్లో నీరు తొలగించండి
- సొసైటీలకు వారానికే బిల్లివ్వాలి
- దోపిడీపై సమాచారమివ్వండి
- మంత్రి నిమ్మల రామానాయుడు
- నేడు ఇసుక సరఫరాపై సమీక్ష

రాజమహేంద్రవరం/కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గోదావరి ఓపెన్ ర్యాంపుల్లో ఇంకా నీరు ఉంటే.. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగు వకు వదిలేసి.. ర్యాంపుల్లో నీరు లేకుండా చేసి..రెండుమూడు రోజుల్లోనే ఓపెన్ ర్యాంపు ల్లో ఇసుకతీత ఆరంభించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని కొవ్వూరు మండలం వాడపల్లి, ఔరంగాబాద్, రాజమహేంద్రవరంలోని గాయత్రి ర్యాంపులను ర్యాంపులను శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. బోట్స్‌మెన్ సొసైటీ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారానికోసారి బిల్లులు చెల్లించాలని, ఇసుక తవ్వకాలు జరుపుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఇసుక బయటకు వెళ్లడం లేదన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకోవడానికి ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. ఇసుక రీచ్‌లలో డివైజ్‌లను, సిబ్బందిని పెంచాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పొల్యూషన్ బోర్డులు అన్ని రీచ్‌లు ప్రారంభించడానికి అభ్యంతరాలు తెలపడంతో కొన్ని రీచ్‌లే ప్రారంభించామన్నారు. పూర్తిస్థాయిలో బోట్స్‌మన్ సొసైటీలు తవ్వకాలు చేపట్టి తీసుకొచ్చిన ఇసుకను ఆన్‌లైన్, ఆఫ్‌లైనులో వినియోగదారులకు పంపించాలన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరంలలో ఇసుక రీచ్‌లపై ఒత్తిడి తగ్గించాలన్నారు. స్వచ్ఛందంగా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై వచ్చి ఇసుక తీసుకువెళ్లే వారికి ఇబ్బందులు, అభ్యంతరాలు సృష్టించవద్దని సీఎం చంద్రబాబు స్పష్టంగా ఆదేశించారని, అధికారులంతా పాటించాలన్నారు. గత జూన్, జూలై నెలల్లో ర్యాంపుల నుంచి తరలించిన ఇసు కకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. బోట్స్‌మెన్ సొసైటీలకు వారానికోసారి బిల్లులు చెల్లించాలని మైన్స్, కలెక్టర్‌లను ఆదేశించామన్నారు. వాడపల్లి రీచ్ నుంచి ప్రతి రోజు 5 వేల టన్నులు ఇసుక సరఫరా చేయాలన్నారు. వైసీపీ నాయకులను చూసి ఎక్కడైనా నాయకులు ఇసుకలో దోపిడీ చేయాలని చూస్తే తన దృష్టికి తీసుకురావాలని మం త్రి నిమ్మల అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వ రరావు, జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, పోలవరం సీఈ నరసింహమూర్తి, ఎస్ఈ జి.శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేనిని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, డీఎస్పీ జి.దేవకుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోట్స్‌మన్ సొసైటీలను పెంచండి

ధవళేశ్వరం ఇరిగేషన్ అతిథి గృహంలో అధికారులు, నాయకులతో మంత్రి సమీక్షించారు. ఇసుక లభ్యత బాగా పెంచాలని, బోట్స్‌మన్ సొసైటీలను పెంచి ఇసుక తీయించాలన్నారు.ఇసుకకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఆన్‌లైన్ ఇబ్బందులు ఉంటే శని వారం నుంచే ఆఫ్‌లైన్‌లో కూడా ఇసుక సరఫరా చేయాలన్నారు. వినియోగదారుడు ర్యాంపు వద్దకు వస్తే ఇసుకతీత, లోడింగ్‌కు కట్టవలసిన సొమ్ము అక్కడే చెల్లించి, ఇసుక తీసుకువెళ్లవచ్చన్నారు. పట్టాభూములు, జిరాయితీ భూముల్లో అధికారుల అనుమతితో రైతులే సొంతంగా ఇసుక తవ్వుకోవచ్చని స్పష్టం చేశారు.కొవ్వూరు ,ఇతర ర్యాంపుల్లోనూ ఇసుక తీతకు కార్మికుల కొరత ఉందని బోట్స్‌మన్ సొసైటీ నిర్వాహకులు మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీపావళి పండుగ కారణంగా పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలంతా వెళ్లిపోయారని.. పైగా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మాత్రమే ఇసుక తీస్తున్నారని చెప్పారు. ఇసుక సరఫరా తదితర అంశాలపై శనివారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పర్యా టక శాఖమంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి,ఎమ్మెల్యేలు సమీక్షించనున్నారు.



కొవ్వూరు మండలం వాడపల్లిలో ర్యాంపును పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు



8

ఆహారమే..ఆరోగ్యం

మారుతున్న జీవన విధానం



అనపర్తి-సామర్లకోట రోడ్డు పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేమగిరి-సామర్లకోట రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వేమగిరి సామర్లకోట కెనాల్ రోడ్డు మరమ్మతులకు మంజూరైన 6.33 కోట్లతో కేశవరం నుంచి బిక్కవోలు వరకు చేపట్టనున్న పనులకు శుక్రవారం అనపర్తిలో భూమిపూజ చేసి ప్రారంభించారు. కెనాల్ రోడ్డును గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేయడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే ఈ రోడ్డు అభివృద్ధికి మూడు రకాల ప్రతిపాదనలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపడం జరిగిందన్నారు. ఈ రోడ్డును జాతీయ రహదారి జాబితాలో కలిపి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇది జరిగే సరికి సుమారుగా రెండేళ్లు పడుతుందన్నారు. అప్పటి వరకూ ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు,సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, అళ్ళ గోవిందు, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు,కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, శివరామ కృష్ణంరాజు,శేషారత్నం పాల్గొన్నారు.




అక్రమార్కులకు దారిదే : ముగ్గళ్ల ర్యాంపు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లలో తరలిస్తున్న తడి ఇసుక

ముగ్గళ్లలో ఇసుక అక్రమ రవాణా

సీతానగరం,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముగ్గళ్ల ర్యాం పులో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. సొసైటీ భూముల్లో తవ్వకాలు జరపడం తగదని.. ముగ్గళ్ల ర్యాంపునకు అనుమతి లేదని బీజేపీ నాయకుడు మట్టాడి వెంకట రమణ శుక్రవారం అడ్డు కున్నారు. దీంతో అక్రమార్కులు దాడిచేసి గాయపర్చారు.వైద్యసేవల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. జిల్లా బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి ఆయనను పరామర్శించి దోషులను శిక్షించాలని కోరారు. కాపలా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల వివరణ తీసుకుని సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటించడంతో ఇసుక అక్రమ రవాణాదారులు విజృంభిస్తున్నారు. మండ లంలో వంగలపూడి , సింగవరం, ములకల్లంక ర్యాంపులకు మాత్రమే అనుమతిచ్చారు. అను మతి లేని మిగిలిన ర్యాంపుల వద్ద అధికారు లను కాపలా ఉంచారు.అయినప్పటికి ముగ్గళ్ళ ఇసుక ర్యాం పు నుంచి ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. గోదావరిలో నీరు ఉన్నప్పటికి నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లతో భారీగా ఇసుక రవాణా చేసేస్తున్నారు.సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు.

వచ్చే నెల 7న కేన్సర్‌పై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌పై వచ్చే నెల 7వ తేదీన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవంపై రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆ రోజున చేపట్టే కార్యక్రమాలపై సమీక్షించారు. కేన్సర్‌ను ముందుగానే గుర్తించడం, నివారించడం, చికిత్స చేయడం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేన్సర్‌పై ప్రజల్లో చైతన్యం పెంచాల్సి ఉందన్నారు. నవంబరు 7న రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్‌లో కేన్సర్ అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరావు, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్ పాల్గొన్నారు.



8

నేటి నుంచి టూరిజం ఆధ్యాత్మిక యాత్ర

ఐదు దేవాలయాల సందర్శన

అద్వితీయంగా పోలీస్ క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న పోలీస్ క్రీడాకారులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో క్రీడాపోటీలు ఉల్లాసంగా సాగుతున్నాయి.ఎప్పుడు పని ఒత్తిడితో పరుగులు పెట్టే పోలీసులు గత రెండు రోజులుగా రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ గ్రౌండ్స్‌లో ఆటలతో సేదతీరుతున్నారు. రన్నింగ్ తదితర క్రీడల్లో పోలీసులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వివిధ క్రీడల్లో పోలీసులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. 200 మీటర్ల రన్నింగ్ మహిళా విభాగంలో సెంట్రల్ జోన్ మహిళా కానిస్టేబుల్ ఆర్.రోహిణి (1469) ప్రథమ, కే.కన్నా (1419) ద్వితీయ, సౌత్ జోన్ నుంచి కే.రోజా (1441) తృతీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల రన్నింగ్ మహిళా విభాగంలో సెంట్రల్ జోన్ నుంచి మళ్లీ ఆర్.రోహిణి (1469) ప్రథమ, కే.భవాని (1418) ద్వితీయ, డీఏఆర్ నుంచి ఎం.జ్యోతి (4710) తృతీయ స్థానంలో నిలిచారు. 800 మీటర్ల రన్నింగ్ మహిళా విభాగంలో సెంట్రల్ జోన్ నుంచి కే.భవాని (1418) ప్రథమ, డీఏఆర్ నుంచి ఎం.జ్యోతి (4710) ద్వితీయ,సౌత్ జోన్ నుంచి కే.రోజా తృతీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పురుషుల విభాగంలో డీఏఆర్ నుంచి పి.బాపన్నదొర (పిసి627)ప్రథమ, ట్రాఫిక్ విభాగం నుంచి టి.అనిల్ కుమార్ (1387) ద్వితీయ, డిఏఆర్ నుంచి జి.సురేష్ (520) తృతీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల విభాగంలో పి.బాపన్నదొర ప్రథమ,డీఏఆర్ నుంచి కేఎస్‌వి రత్నం ద్వితీయ,సౌత్ జోన్ నుంచి పి.సతీష్ కుమార్ తృతీయస్థానంలో నిలిచారు. 4/400 మీటర్ల విభాగంలో డీఏఆర్ ప్రథ మ, ట్రాఫిక్ విభాగం ద్వితీయ, సెంట్రల్ జోన్ విభాగాల క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచారు. 800 మీటర్ల విభాగం లో నార్త్ జోన్ నుంచి ఎస్ఆర్‌డీవీ ప్రసాద్ ప్రథమ, డీఏఆర్ నుంచి వి.కమలహాసన్ ద్వితీయ, ఎం.శంకర్ తృతీయ స్థానంలోనిలిచారు. శనివారంతో క్రీడలు ముగుస్తాయి.

మనుషుల జీవన విధానంలో ఎప్పటికప్పుడు మార్పులొస్తుంటాయి. అలవాట్లు, ఆహారం విషయాలు అనేక మార్పులు చేర్పులకు ప్రభావితం అవుతుంటాయి. ఆహారంపై నవీన పద్ధతులను అనుసరించేవారు ఓవైపు, ఆధునిక జీవనంలో కూడా ఆరోగ్యమే ప్రధానంగా చక్కటి ఆహారపు నియమాలతో కొనసాగేవారు మరొకవైపు కనిపిస్తారు. ముఖ్యంగా కొవిడ్ తర్వాత వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చాలా మందికి పెరిగింది. దైనందిన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించే విధానాలకు ఎంతో మంది ఆకర్షితులవుతున్నారు. రోజూ నడక, వ్యాయామంతోపాటు మంచి ఆహారాన్ని పొందడమూ చాలా ముఖ్యమని భావిస్తున్నారు. దానికి అనుగుణంగానే సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆహారాన్ని స్వీకరించే వారి సంఖ్యా పెరుగుతోంది. దాంతో పొద్దుటే మార్నింగ్ వాక్ చేసే పార్కుల వద్దే రాగి జావ, జొన్న జావా, కొర్రల జావా, రాగి సంగటి ఇలా ఆరోగ్యకర ఆహారాన్ని విక్రయిస్తున్నారు. అలాగే చిరు, తృణధాన్యాలతో చేసిన మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా, పొట్టిక్కలు వంటి ఎన్నో రకాల అల్పాహారాల అమ్మకాలు సైతం జోరుగా సాగుతున్నాయి. ఇక జ్యూస్‌ల సంగతి.. ఇది వరకు పండ్ల రసాల జ్యూస్‌లు, లస్సీలు ఆరోగ్యం కోసమంటూ తాగేవారు. ఇటీవల కూరగాయలతో జ్యూస్‌ల వినియోగం బాగా పెరిగింది. ఆస్పత్రుల సమీపంలో కాకరకాయ జ్యూస్ స్పెషల్ అనో, బూడిదగుమ్మడి జ్యూస్ తమ ప్రత్యేకత అనో బోర్డులు కనిపిస్తున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. మంచి ఆహారమే మంచి ఆరోగ్యం అన్నది నేటి ట్రెండ్..



ఆహారమే.. ఆరోగ్యం!







ఉదయాన్నే జావతో మొదలు.. ఆకలేస్తే మిల్లెట్ ఇడ్లీ.. వెజిటబుల్ జ్యూస్‌లు.. పెరుగుతున్న ఆరోగ్య స్పృహ

జావ తాగేద్దాం.. మొలకలూ లాగిద్దాం!

తెలతెల్లవారుతుండగా.. అలా వాకింగ్‌కి వెళ్లి.. సూర్యోదయం కావొస్తున్న వేళ వేడి వేడి రాగి జావ తాగేవారు లక్షల్లో ఉంటారు. ఇవాళ ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుండడంతో రాగి జావకు యమగిరాకీ పెరిగింది. అందులోనూ తక్కువ ఖర్చుతో సిద్ధమైపోతుంది. ఈ అవకాశాన్ని యువకులు ఒడిసి పట్టుకొని.. ఉదయం వేళ పట్టుమని ఓ నాలుగు గంటలు కేటాయించి జనాలకు ఆరోగ్యమిస్తూ.. ఇటు వీళ్లూ ఉపాధి పొందుతున్నారు. రాగి ముద్ద, రాగి ఇడ్లీ, రాగి దోసెలు, రాగి లడ్డు వంటివి కూడా ఈ మధ్య విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. వీటిలో రాగి జావ తీరే వేరు. వాస్తవానికి చిరు ధాన్యాలను సిరి ధాన్యాలుగా పిలుస్తారు. అవి ఆరోగ్యానికి చేసే మేలు అపారమని వైద్యులూ చెబుతుంటారు. ఈ మధ్య ఆహారంలో కూడా చిరు ధాన్యాలతో చేసిన వంటకాలు ప్రధానంగా మారిపోయాయి. ఆ సిరి ధాన్యాల్లో రాగులను రారాజుగా చెప్పవచ్చు. వీటినే ఫింగర్ మిల్లెట్స్ అంటారు. ఈ తరం వాళ్లకు తెలియకపోవచ్చుగానీ ఒకప్పుడు రాగి మాల్ట్‌ని పిల్లలు ఇష్టంగా తాగేవాళ్లు. తర్వాత రసాయన సమ్మేళనాలతో వచ్చే పొడుల రుచికి అలవాటుపడిపోయారు. ఇప్పుడు మళ్లీ రాగి మాల్ట్ ట్రెండ్ ఉరకలు పెడుతోంది. రోడ్డు పక్కన చిన్న బడ్డీల్లో రాగి జావను ఉదయంపూట విక్రయిస్తున్నారు. తక్కువ స్థలం, తక్కువ పెట్టుబడి, ఎక్కువ ప్రయోజనకరంకావడంతో యువత ఇటువైపు మళ్లుతోంది.





గోదావరి గట్టున వాకింగ్‌కు వచ్చిన వారికి రాగి, కొర్రలు తదితర జావలను విక్రయిస్తున్న దృశ్యం

రాగి పిండి తక్కువ ధరకే దొరకడం, స్పూను పిండితోనే సుమారు అర లీటరు రాగి జావ తయారుకావడంతో పావులీటరు గ్లాసు రూ.10కే అందుబాటులోకి వచ్చింది. దీనికి మజ్జిగ, జీలకర్ర పొడి, మిరియాల పొడి, నిమ్మ రసం కూడా జత చేస్తూ రుచిని రెట్టింపు చేస్తున్నారు. కొన్నిచోట్ల రాగిజావతోపాటు జొన్న జావ, కొర్రల జావ, రాగి సంకటి వెజిటబుల్ సూప్, మొలకెత్తిన పెసలు, ఉడకబెట్టిన సెనగలు, స్వీట్‌కార్న్, కీర బీట్‌రూట్ క్యారెట్, కాకర ముక్కలు, నానబెట్టిన బాదం గింజలు, ఉడకబెట్టిన గుడ్లు, రాగి తోపా, చిమిలి వంటివీ విక్రయిస్తున్నారు. వీటి ధర కూడా రూ.10 మాత్రమే. అవన్నీ కూడా శరీరానికి మరింత మేలు చేసేవేకావడంతో లొట్టలేసుకొని తాగడంతోపాటు ఇళ్లకూ పార్సిల్ తీసుకెళ్తున్నారు. నిజానికి రాగి జావను సూపర్ ఫుడ్‌గా చెబుతారు. రాగి జావలో ప్రధానంగా 'ఎలుసినియన్' అనే ప్రొటీన్ ఉంటుంది. దీనికి జీవ ప్రక్రియలో అధిక ప్రాధాన్యం ఉంది. ప్రొటీన్, కార్బొహైడ్రేడ్స్, ఖనిజ లవణాలు, ఈ, సీ విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, కొవ్వులు, ఫైబర్, బీ కాంప్లెక్స్ థయమిన్, నియాసిన్, రిబోఫ్లేవిన్‌ని శరీరం పొందుతుంది. రాగిపిండి సహజ ఐరన్ కూడా. కాల్షియం, ఇనుము ఎముకలను బలోపేతం చేస్తాయి. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. బీపీ హద్దుల్లో ఉంటుంది. రాగి జావలో ఉండే మెగ్నీషియం, డైటరీ ఫైబర్, పాలీఫినాల్స్ వంటివి రక్తంలోని గ్లూకోజ్‌ని నియంత్రించడం వల్ల షుగర్‌తో బాధపడే వాళ్లకు మేలు కలుగుతుంది. అధిక బరువును తగ్గించుకోవచ్చు. కాలేయ వ్యాధులు దూరమవుతాయి. జీర్ణక్రియకు రాగులు దోహదపడతాయి. - రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి



మిల్లెట్ ఇడ్లీ, పొట్టిక్కలు..

చిరు, తృణధాన్యాలతో చేసిన అల్పాహారానికి కూడా మార్కెట్‌లో చాలా గిరాకీ పెరిగింది. ఇదివరకు వాకింగ్‌కు వెళ్లేవారు, క్రీడాకారులు, జిమ్‌లకు వెళ్లేవారు మాత్రమే వీటివైపు చూసేవారు. ఇప్పుడు చాలా మంది మిల్లెట్ ఇడ్లీ, తృణధాన్యాలతో చేసిన అల్పాహారాలు ఎక్కువగా తీసుకుంటున్నారు. దాంతో అయా అల్పాహారాలు అందించే దుకాణాలు సైతం విరివిగా పెరిగాయి. చిరుధాన్యాలతో దాదాపుగా అన్ని రకాల ఆహారాన్ని తయారుచేసే విధానం కూడా బాగా పెరిగింది. ఇళ్ల దగ్గరకన్నా మార్కెట్‌లో సులువుగా దొరుకుతుండడంతో ఈ బిజినెస్ పెరిగింది.

ఆరోగ్యం కోసం వెజిటబుల్ జ్యూస్

కొందరు ఫాస్ట్‌ఫుడ్లకు అలవాటు పడుతుంటే, మరికొందరు మంచి ఆరోగ్యానిచ్చే ఆహారాన్ని స్వీకరిస్తున్నారు. వైద్యులు కూడా ఫాస్ట్‌ఫుడ్లు మాని కూరగాయలు, ఆకుకూరలు తినమని సలహా ఇస్తున్నారు. కొవిడ్ తర్వాత చాలామంది విటమిన్స్ కలిగిన ఆహారపు అలవాట్లను అలవాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆకుకూరలు, కూరగాయలు జ్యూస్‌లు తాగడం మొదలెట్టారు. దీంతో నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా వెజిటబుల్ జ్యూస్ సెంటర్లు వెలిశాయి. అనారోగ్యకరమైన ఆహారం, బిజీ లైఫ్‌స్టైల్ కారణంగా రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతోంది. ఇది గుండె ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని, సమతుల్య ఆహారం పాటించాలని, ఇంట్లో తయారుచేసిన కూరగాయల రసం తాగాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. ప్రకృతిలో లభించే ఆకుకూరలు, కూరగాయల్లో ఆరోగ్యానికి మేలు చేసే వివిధ రకాల గుణాలుంటాయి. కూరల్లానే కాకుండా.. జ్యూస్ రూపంలో తీసుకున్నా అద్భుత ప్రయోజనాలు చేకూరుతాయి. దీంతో ఈ వ్యాపారం జోరుందుకుంది. పార్కులు, క్రీడాస్థలాలు, ఆసుపత్రుల వద్ద వీటి అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక ఏ కూరగాయ రసం దేనికి ఉపయోగపడుతుందో చూద్దాం.

బీట్‌రూట్ : బీట్‌రూట్ రసంతో కంటిచూపు మెరుగుపడుతుంది. అజీర్తి, పెప్టిక్ అల్సర్, కడుపునొప్పి సమస్యలకు మంచి పరిష్కారం. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరగాలంటే బీట్‌రూట్‌కు మించింది మరొకటి లేదు.

కారెట్ జ్యూస్ : కారెట్ జ్యూస్‌లో అధికంగా ఉండే విటమిన్ ఏ కంటికి మంచిది. కేన్సర్ కణాల్ని నిరోధించే గుణం కారెట్‌లో ఉంది. కొలెస్ట్రాల్‌వంటి సమస్యలున్నవారికీ మంచిది.

కీర, దోసకాయ జ్యూస్ : కీరా లేదా దోసకాయ జ్యూస్‌తో అన్ని రకాల కడుపు సంబంధిత సమస్యలు దూరమవుతాయి. దోసకాయ ఒంటికి చలువ కలిగిస్తుందని చెబుతున్నారు.

బూడిద గుమ్మడి జ్యూస్: ఈ జ్యూస్ క్రమం తప్పకుండా తీసుకుంటే.. కిడ్నీలో రాళ్ల సమస్య, స్త్రీలలో రుతు సమస్య, అధిక రక్తస్రావం, మలబద్ధకం, ఎసిడిటీ వంటివి దూరమవుతాయి.

అలొవెర ఉపయోగాలు : వేడి తగ్గించడం, పైల్స్ తగ్గించడంతోపాటు రాకుండా ఉండటానికి, మానసిక రుగ్మతల నుంచి ఉపశమనం.

గోధుమగడ్డి జ్యూస్: రక్తసిద్ధి, కొలెస్ట్రాల్, బ్లడ్ ప్రెజర్ చర్మవ్యాధులు, మధుమేహం, రోగనిరోధకశక్తికి ఉపయోగపడుతుంది.

ఉసిరి జ్యూస్: కాలేయ సమస్య ఉంటే ఉసిరి రసాన్ని తయారుచేసి తేనెతో కలిపి తినాలి. ఇది కాలేయాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. జాండిస్‌తో బాధపడుతున్న వారికి ఉపశమనం కలుగుతుంది. ఖాళీ కడుపుతో ఉసిరికాయ రసం తాగడం వల్ల త్వరగా బరువు తగ్గవచ్చు.

పాలకూర జ్యూస్: రక్తపోటును నియంత్రిస్తుంది. పాలకూర నీటిలో సహజంగా లభించే నైట్రేట్‌లు అధికంగా ఉంటాయి. రక్తనాళాలను విస్తరించడంలో సహాయపడే ఒక రకమైన సమ్మేళనం, రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తప్రసరణను పెంచుతుంది. గుండె సంబంధిత వ్యాధులను నివారిస్తుంది.

కాకరకాయ జ్యూస్: ఈ జ్యూస్ పరగడుపున తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. కాకరకాయలో యాంటి ఆక్సిడెంట్లు, యాంటీ అలర్జీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి.

మునగాకు జ్యూస్: మునగాకులో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఆకుల్లో నారింజ కంటే 7 రెట్లు ఎక్కువ విటమిన్ సి, అరటిపండ్ల కంటే 15 రెట్లు ఎక్కువ పొటాషియం ఉంటుంది. ఇది కాల్షియం. ప్రొటీన్ ఐరన్, అమైనో యాసిడ్‌లను కూడా కలిగి ఉంది.

జ్యూస్ ధరలు ఇలా :

ఏ జ్యూస్ అయినా కాకినాడ నగరంలో రూ.30, విటమిన్ ఏ, బీ, సీ జ్యూస్ అయితే రూ.60, గోధుమగడ్డి జ్యూస్ రూ.40, మిక్స్ వెజిటేబుల్స్ జ్యూస్ రూ.40 విక్రయిస్తున్నారు.

- కాకినాడ కార్పొరేషన్/ఆంధ్రజ్యోతి

గోవిందా...హరి గోవిందా

- ఐదోరోజు బ్రహ్మోత్సవాల్లో మహాలక్ష్మి హోమం
- భక్తి శ్రద్ధలతో గోదావరి నదీజల సంగ్రహణం
- మలయప్ప అలంకరణలో గరుడ వాహనంపై శ్రీవారు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆత్రేయపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడ్ని చేశారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరి పూజలు అందుకున్నారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం.. ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, అభిషేకాలు, హోమాలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు జరిపారు. మంగళ వాయిద్యాలతో శోభాయాత్రగా వెళ్లి గోదావరి నదీజల సంగ్రహణ నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి మూలమంత్ర పూర్వక మహాలక్ష్మి హోమం వేదమంత్రాల సాక్షిగా జరిపారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కనక దుర్గాదేవి దంపతులు బ్రహ్మోత్సవ పూజలు చేశారు. వివిధ రాష్ట్రాల కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఊర్రుతలూగించాయి. విద్యుత్ దీపాలంకరణ, మంగళ వాయిద్యాలతోపాటు సుగంధ పరిమళాలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య స్వామివారి క్షేత్రం పులకించింది. ఫొటోషూట్‌ల వద్ద భక్తులు సందడి చేశారు. రాత్రి మలయప్ప అలంకరణతో అలంకృతుడైన శ్రీవారు గరుడ వాహనంపై ఆశీలనులయ్యారు. వేదఘోష, మిరుగొట్టు గొలిపే బాణసంచా కాల్పుల మధ్య తిరువీధుల్లో స్వామివారు విహరించారు. కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు కూటమి నాయకులు, ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో ...

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు శనివారం మహాపుష్ప యాగము, శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారి సూర్యప్రభ వాహనసేవ, సహస్ర దీపాలంకరణ సేవ, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహనసేవ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు పాల్గొంటారు.

బ్రహ్మోత్సవాలకు ఊరారా ప్రచారం

వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 29 వరకు జరగనున్నాయి. భక్తులు వీటిని తిలకించేలా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఉచిత బస్సులు ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలు తిలకించే ఏర్పాట్లు చేశారు. ఆటోల్లో సిబ్బంది విస్తృత ప్రచారం చేస్తున్నారు.



శ్రీవారికి కురువేరు దండ

ఖరీదు కిలో రూ.10వేలు

శ్రీ వేంకటేశ్వరస్వామికి ఎంతో ప్రీతికరమైన కురువేరు దండ ప్రాముఖ్యత సంతరించుకుంది. తమిళనాడు, కేరళ సముద్రతీరం వెంబడి నేలలో పెరిగే కురువేరు దండ ఎంతో ఖరీదైనది. కిలో రూ.10వేల నుంచి రూ.12వేలు పలుకుతుంది. ప్రతిఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలకు దాన్ని ఉపయోగిస్తారు. గరుడ వాహనంపై విహరించే శ్రీవారికి ఈ దండను వేస్తారు.



వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న వేద పండితులు



లక్ష కుంకుమార్చన పూజలు చేస్తున్న దృశ్యం



మహిళా భక్తుల సాంస్కృతిక ప్రదర్శన


నేటి నుంచి ఆధ్యాత్మిక పర్యాటక యాత్ర

టూరిజం బస్సును ప్రారంభించనున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వారాంతపు ఆధ్యాత్మిక యాత్రకు శనివారం శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్‌లో ఉన్న టూరిజం ఆర్డీ ఆఫీసు నుంచి ఉదయం 6 గంటలకు బస్సును ప్రారంభించనున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక దేవాలయాలు, పంచారామ క్షేత్రాలు సందర్శించేవారి కోసం ప్రత్యేక ప్యాకేజీ నిర్ణయించారు. తొలుత భక్తులకు ఆధ్యాత్మిక సాంత్వన కలిగించడానికి ఆరు పుణ్యక్షేత్రాలతో ఈ యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాలను కలుపుతూ ప్రతి శనివారం ఈ యాత్ర ఉంటుంది. రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ టూరిజం శాఖ ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం(ఐఆర్‌వో) వద్ద ప్రతి శనివారం ఉదయం 6గంటలకు బస్సులు బయలుదేరతాయి. ఈ యాత్ర రాత్రి 7.30 గంటల వరకు కొనసాగుతుంది.

యాత్ర ఇలా:

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనంతో యాత్ర మొదలవుతుంది. అనంతరం అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోటలోని చాణుక్య కుమార రామ భీమేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అక్కడ మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. చివరగా వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు.



టికెట్ ధరలు

పెద్దలకు టికెట్ ధర రూ.1000 నిర్ణయించారు. మూడు నుంచి పదేళ్లలోపు వయస్సు గల చిన్నారులకు రూ.800 నిర్ణయించారు. శుక్రవారం రాత్రి 10 మంది యాత్రికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. ఈ బస్సులో 18 మంది యాత్రికులు ప్రయాణించవచ్చు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి మంత్రి దుర్గేష్

రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా ఒకరోజు ఆధ్మాతిక యాత్రను ప్రారంభిస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేల సూచన మేరకు ఈ యాత్ర ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. భక్తులను రద్దీని బట్టి బస్సులు ఏర్పాటు చేస్తామని, ఆదివారం కూడా యాత్రను కొనసాగించే ఆలోచన చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పవిత్రోత్సవాలకు అప్పనపల్లి ముస్తాబు

నేటి నుంచి ప్రారంభం

మామిడికుదరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి పవిత్రోత్సవాలకు అప్పనపల్లి ముస్తాబైంది. శనివారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. శనివారం ఉదయం విశ్వక్సేనారాధనతో ప్రారంభమయ్యే పవిత్రోత్సవాల్లో భాగంగా పలు పూజలు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు జరిగే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని పలు పూజలు నిర్వహించి శ్రీవారి శాంతి కల్యాణాన్ని జరపనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ త్రిదండి చినజీయర్‌స్వామి శిష్య బృందం, చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకులు, గొడవర్తి శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతిష్ఠతో సమానమైన పవిత్రోత్సవాల ద్వారా శ్రీవారిలో విశేషమైన తేజస్సు కలుగుతుందని తెలిపారు. భక్తులకు సమర్పణ చేసే పూజా ద్రవ్యాల ద్వారా పుష్పాలు, వస్త్రాలు మనసా వాచా కర్మణా జరిగే దోషాలు పరిహారమవుతాయని వారంటున్నారు. భక్తులు పవిత్రోత్సవాల్లో పాల్గొనాలని సహాయ కమిషనర్ కోరారు.



పవిత్రోత్సవాలకు చలువ పందిళ్లు వేస్తున్న సిబ్బంది



పవిత్రోత్సవాలకు ముస్తాబైన బాలబాలాజీ ఆలయం



విద్యార్థులు ప్రదర్శించిన అంశాలు

విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకు

సైన్స్ ఫెయిర్ దోహదం

జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

పిఠాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదం చేస్తాయని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల ఫ్యూచర్-2024 సైన్స్ ఫెయిర్, ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన అంశాలు ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. ప్రాజెక్టులు, ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి జీ.వెంకటరావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బీవీ వెంకట త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



మత్స్యకారుల వలలో 20 అడుగుల కొండచిలువ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సలాదివారిపాలెం వారధి వద్ద గోదావరి నదీ పాయలో మత్స్యకారుల వలలో 20 అడుగుల భారీ కొండచిలువ చిక్కింది. దానిని వారు నది ఒడ్డున వదిలేసి వెళ్లిపోయారు. చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురై హతమార్చారు. రెండేళ్ల క్రితం ఈ కొండచిలువ సలాదివారిపాలెం వారధి వద్ద పశువుల్లంక వైపు సంచరించడాన్ని గుర్తించామని... ఇవతల వైపునకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో మత్స్యకారుల వలలో చిక్కుకుని ఉండవచ్చని స్థానికులు చెప్పారు.

- ముమ్మిడివరం



తలుపులమ్మ అమ్మవారికి ఐజీ పూజలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారిని ఏలూరు రేంజ్ ఐజీ జీవీవీ అశోక్‌కుమార్ కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం మహా మండపంలో వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ అధికారులు మహాప్రసాదం అందజేసి ఆలయ చరిత్ర, విశిష్టతను వివరించారు.

- తుని రూరల్

కార్తీక మాస ఏర్పాట్లపై

రేపు సమీక్ష

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న ప్రారంభం కానున్న కార్తీక మాసంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, స్వామివారి తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ ఏర్పాట్ల పై ఆదివారం అన్నవరం దేవస్థానంలో సమీక్ష జరగనుంది. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, అగ్నిమాపక, విద్యుత్, ఆర్టీసీ శాఖల ఉన్నతాధికారులతో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. దేవస్థానం సుమారు రూ.80 లక్షలతో కొనుగోలు చేసిన బస్సులను ఉదయం 9 గంటలకు ఈవో ప్రారంభిస్తారు. మరోపక్క అదేరోజున భక్తులు సత్యదీక్ష స్వీకరించనున్నారు. ఇప్పటికే సుమారు 1,500 మందికి దీక్షా వస్త్రాలు, మాలలను దేవస్థానం తరఫున ఉచితంగా అందజేశారు.



ఆశీర్వచనం ఇస్తున్న వేద పండితులు

సత్యదేవుని సన్నిధిలో విజయ రాజేశ్వరీ

శ్రీవిద్యా పీఠాధిపతి

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి విజయవాడ సమీపంలోని విజయ రాజేశ్వరీ శ్రీవిద్యా పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామీజీ శుక్రవారం విచ్చేశారు. ఆయనకు ఏపీ ఆర్వో ఎం.గణపతి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామీజీ వెంట శిష్యులు విజయ భూమానందగిరి, శివప్రియానందగిరి వున్నారు.

ఇద్దరు వ్రత పురోహితుల

సస్పెన్షన్

నలుగురు సూపర్‌వైజర్లకు చార్జి మెమో

అన్నవరం, అక్టోబరు 25: అన్నవరం దేవస్థానంలో సెకండ్‌గ్రేడ్ వ్రత పురోహితులుగా పని చేస్తున్న రాయప్రోలు ఎస్‌వీఎస్ శ్రీరామచంద్రమూర్తి, పెండ్యాల వీఆర్‌టీకే శర్మ (రాము)లను సస్పెండ్ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్రత మాచరించే భక్తుల నుంచి దానాల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న వేర్వేరు ఫిర్యాదుల మేరకు వారిద్దరిపై ఈ చర్యలు తీసుకున్నారు. వారి డ్యూటీ సూపర్‌వైజర్లు చామర్తి కన్నబాబు, గుత్తిన శ్రీనివాస్, చామర్తి జగ్గారావు, పొన్నపల్లి శాస్త్రిలకు చార్జి మెమో ఇచ్చారు. ఈవో శుక్రవారం ఉదయం తన కార్యాలయంలో వ్రత పురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. భక్తులు ఇచ్చింది సంతృప్తిగా తీసుకోవాలని... వ్రతం పూర్తయిన అనంతరం వస్త్రదానం, అన్నదానం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్తీక మాసంలో వ్రత మాచరించే భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఉత్తర్వులకు అనుగుణంగా వ్రతాలు ప్రారంభించాలని కోరారు.

అత్యాచారయత్నానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

పి.గన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో ఈ నెల 23న అరవై ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన లంకె సత్యనారాయణపై బాధితురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో భాగంగా అందిన సమచారంతో సత్యనారాయణను ఆయన నివాసంలో సీఐ ఆర్.భీమరాజు అరెస్టు చేశారని ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. నిందితుడిని కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.



నన్నయ విశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులతో రిజిస్ట్రార్ సుధాకర్

నన్నయ వర్సిటీకి మరింత గుర్తింపు తేవాలి

రిజిస్ట్రార్, క్రీడా బోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ బాస్కెట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు తమ ప్రతిభతో నన్నయ విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, క్రీడా బోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి. సుధాకర్ కోరారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులు జరిగిన అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ కం జట్టు ఎంపిక శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ టోర్నమెంట్‌కు హాజరైన వారిలో ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులతో పాటు మరో నలుగురిని నన్నయ విశ్వవిద్యాలయం జట్టు సభ్యులుగా ఎంపిక చేశామన్నారు. వీరు నవంబరు ఒకటో తేదీ నుంచి బెంగళూరులోని క్రైస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో రామచం



ట్రోఫీ అందుకుంటున్న రామచంద్రపురం ప్రభుత్వ కళాశాల క్రీడాకారులు

ద్రపురం ప్రభుత్వ కళాశాల, రెండో స్థానంలో జి.మామిడాడ డీఆర్కే రెడ్డి కళాశాల, మూడవ స్థానంలో పెనుగొండ ఎస్‌కేవీపీ కళాశాల, నాలుగో స్థానంలో ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల నిలిచాయి. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఎంపీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులైన రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు రమణ, కోర్సు కో-ఆర్డినేటర్ కె.బాలసత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, బి.రామ్‌గోపాల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ నన్నయ విశ్వవిద్యాలయ పురుషుల జట్టు

వై.పవన్‌కుమార్, వి.అఖిల్‌కుమార్, ఎస్.వంశీ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం), టి.రాజేష్‌కుమార్, కె.సత్యనారాయణ, ఎస్‌కే అహ్మద్ ఆలీషా (డీఆర్‌కే రెడ్డి కళాశాల, జి.మామిడాడ), వి.సాయికిరణ్, ఎస్.ప్రవీణ్‌కుమార్, కేవీఎస్ కృష్ణారెడ్డి (ఎస్‌వీకేపీ కళాశాల, పెనుగొండ), బి.నీరజ్‌కుమార్ (సీఆర్ఆర్ కళాశాల, ఏలూరు), ఒ.రాజేష్ (పీఆర్ ప్రభుత్వ కళాశాల, కాకినాడ), సీహెచ్ అవినాష్ (సూర్యరాయ కళాశాల, పిఠాపురం), పి.అనిల్‌కుమార్ (ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం), ఎస్.జానకిరామ్ (ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), కె.షాహిల్ (వీఎస్ఎం కళాశాల, రామచంద్రపురం).

పూడ్చిపెట్టిన మృతదేహానికి పంచనామా

అక్రమ సంబంధం నేపథ్యంలో మధుని హతమార్చారని బంధువుల ఆరోపణ

పోలీసుల అదుపులో శిరీష, ప్రశాంత్

తొండంగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరం గ్రామంలో వారం క్రితం మృతి చెందిన బత్తిన మధుబాబు (38) మృతదేహానికి అధికారులు శుక్రవారం శవ పంచనామా నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి మధుబాబు భార్య శిరీష, రౌతులపూడి మండలం శృంగవరం గ్రామానికి చెందిన పీతల ప్రశాంత్‌కుమార్... మధుబాబు ఇంట్లో కలిసి ఉండడాన్ని గుర్తించిన గ్రామస్థులు, బంధువులు పట్టుకున్నారు. వారిద్దరి మధ్య ఉన్న అక్రమ సంబంధం కారణంగానే మధుబాబును హత్యచేసి ఉంటారని, సహజ మరణం కాదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మధుబాబు (పాత చిత్రం)

ఇద్దరినీ పోలీసులకు అప్పగించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీతంపేట సమీపంలోని ఒక ఆసుపత్రిలో పనిచేస్తున్నపుడు శిరీష, ప్రశాంత్‌కుమార్ మధ్య ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధంగా మారిందని, మానుకోవాలని మధుబాబు పలుమార్లు హెచ్చరించాడని బంధువులు పోలీసులకు తెలిపారు. తాజాగా భర్త మృతి చెందిన వారం గడవక ముందే శిరీష, ప్రశాంత్‌కుమార్ కలిసి ఉండడంతో వారే మధుబాబును అడ్డుతొలగించుకునే లక్ష్యంతో హత్య చేసి ఉంటారని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు శ్మశానంలో పూడ్చిపెట్టిన మధుబాబు మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. తొండంగి తహసీల్దారు మురార్జీ సమక్షంలో తుని ఏరియా ఆసుపత్రి వైద్యులు జగన్మోహన్, సాయికిరణ్ శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. శిరీష, ప్రశాంత్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు.

లారీ ఢీకొని వార్డు సభ్యుడి మృతి

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో రంగంపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బోడెం నాగేశ్వరరావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు వివరాల ప్రకారం... నాగేశ్వరరావు బైక్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో దివాన్‌చెరువులోని పాతూరి రామాలయం వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. నాగేశ్వరరావు తలపై నుంచి వాహనం వెళ్లిపోవడంతో మెదడు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు సంఘటనాస్థలానికి చేరుకుని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నాగేశ్వరరావు వెంకటాపురం పంచాయతీ 4వ వార్డు సభ్యుడని, గ్రామంలో అందరితో కలుపుగోలుగా వ్యవహరిస్తాడని సర్పంచ్ గంగరావు తెలిపారు.



నాగేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

దసరాకు గ్రామంలో కిరాణా వ్యాపారం ప్రారంభించాడని... రాజమహేంద్రవరం వెళ్లి కిరాణా సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసుకుని వస్తూ ప్రమాదానికి గురి కావడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బొమ్మూరు ఎస్‌ఐ ఎస్‌పీ కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రికి అన్నీ తానై...

పాణింగపల్లిలో అంతిమ సంస్కారాలు నిర్వహించిన కుమార్తె

కె.గంగవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రికి అంతిమ సంస్కారాలు చేసి రుణం తీర్చుకుంది ఓ కుమార్తె. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పాణింగపల్లికి చెందిన చేత్రాది సత్యనారాయణకు ఒక్కగానొక్క కుమార్తె వీరవేణి. ఆమెను కె.గంగవరం గ్రామానికి చెందిన నేమాని శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం చేయగా ఇద్దరు కుమార్తెలు జన్మించారు. విధి వక్రీకరించి పిల్లల చిన్న తనంలోనే శ్రీనివాస్ మృతి చెందాడు. ఇద్దరు కుమార్తెలతో వేణు తండ్రి చెంతకు చేరుకుంది. ఇద్దరు పిల్లలను పెద్దచేసి వివాహాలు చేశారు. సత్యనారాయణ శుక్రవారం వయోభారంతో కన్నుమూశాడు. చిన్నతనం నుంచే తనను అల్లారు ముద్దుగా పెంచడమే కాకుండా తనకు వైధవ్యం కలిగిన తర్వాత పిల్లలను పెంచి



తండ్రి అంతిమ యాత్రలో పాల్గొన్న వీరవేణి

పోషించి వారికీ పెళ్లిళ్లు చేసిన తండ్రి లోకం విడిచిపోవడంతో వీరవేణి కన్నీరుమున్నీరుగా విలపించింది. కొడుకులు లేని లోటు లేకుండా తానే కొడుకుగా మారి అంతిమ సంస్కారాలు నిర్వహించింది.

ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

పిఠాపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ బాలాజీ రైసుమిల్లులో జరుగుతున్న షెడ్డు నిర్మాణ పనుల్లోకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడికి చెందిన పుట్టి వెంకటరమణ వచ్చాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు రేకు తగిలి తీవ్ర గాయం కావడంతో అక్కడిక్కడే మరణించాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ పరిశీలించారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



రామాలయం ఆవరణలో దీక్ష కొనసాగిస్తున్న శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి

పవన్ కల్యాణ్ నుంచి హామీ లభిస్తేనే

దీక్ష విరమిస్తాం

- గుమ్మళ్లదొడ్డిలో నాలుగో రోజుకు నిరవధిక దీక్ష
- భగ్నం చేసేందుకు పోలీసుల యత్నం
- అడిషనల్ ఎస్పీతో చర్చలు విఫలం



దీక్ష చేస్తున్న వారితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సుబ్బరాజు

గోకవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ నుంచి తమకు హామీ లభిస్తేనే దీక్ష విరమిస్తామని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తొలగించాలని డిమాండ్ చేస్తూ బాధితులతో కలిసి వారు చేపట్టిన నిరవధిక దీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ ప్రాణాలైనా అర్పిస్తాం గాని ఇథనాల్ పరిశ్రమ నిర్వహణను గుమ్మళ్లదొడ్డిలో కొనసాగనివ్వబోమన్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ద్వారా ఈ విషయం పవన్‌కల్యాణ్‌కు చేరేలా యంత్రాంగం కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ పరిశ్రమ వల్ల ఇప్పటికే చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు అనేక రకాల శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందిపడుతూ ఆసుపత్రులపాలవుతున్నారని ఆవేదన చెందారు.

దీక్షా శిబిరాన్ని రాజమహేంద్రవరం అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు, సీఐ రాంబాబు సందర్శించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ వచ్చి తమ ఇబ్బందులను స్వయంగా పరిశీలించి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ద్వారా సరైన హామీ ఇప్పిస్తేనే దీక్ష విరమిస్తామని బాధితులు వారికి చెప్పారు.

కాగా నిరవధిక దీక్షను భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో బాధితులు, ప్రజలు వారితో వాగ్వాదానికి దిగారు. ప్రాణాలకు తెగించి దీక్ష చేస్తుంటే దౌర్జన్యానికి దిగుతారా అంటూ ఆందోళనకారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో పోలీసులు మిన్నకుండిపోయారు. రామాలయంలోకి వెళ్లి తాళాలు వేసుకుని దీక్షను కొనసాగిస్తున్నారు.

ఇథనాల్ పరిశ్రమ నుంచి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, తక్షణం ఇక్కడి నుంచి తొలగించాలని గుమ్మళ్లదొడ్డి పంచాయతీ పాలకవర్గం తరఫున తీర్మానం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని సర్పంచ్ శరకణం రామలక్ష్మి తెలిపారు.

విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విభాగ్ కన్వీనర్ సత్యసాయి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వైశ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. రెండు రోజులు జరిగే ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవుతారని, పలు అంశాలపై చర్చిస్తామని సత్యసాయి చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి అభిషేక్, మహిళా కన్వీనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో కల్తీ నెయ్యి తయారీ

మునిసిపల్, పోలీసు అధికారుల దాడులు

265 కిలోల పదార్థాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న జంతువుల కొవ్వు, డాల్డా, ఇతర సామాగ్రి

పిఠాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో కల్తీ నెయ్యిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని పద్మావతినగర్‌లో ఓ ఇంట్లో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారన్న సమాచారంతో కమిషనరు కనకారావు ఆధ్వర్యంలో మునిసిపల్, పోలీసు సిబ్బంది శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తయారు చేసిన, తయారీకి సిద్ధంగా 12 టిన్నుల్లో, పలావు డేగిసాల్లో ఉన్న 265 కిలోల జంతువుల కొవ్వు, డాల్డా కల్తీ నెయ్యి, ఇతర పదార్థాలు, నెయ్యి తయారీకి వినియోగించే సామగ్రిని సీజ్ చేశారు. వీటితో కల్తీ నెయ్యి తయారు చేసి దీపాలు వెలిగించే నెయ్యిగా విక్రయిస్తున్నట్టు ఇంట్లో ఉన్న మహిళలు తెలిపారని కమిషనరు చెప్పారు. చట్టవిరుద్ధంగా తయారు చేస్తున్న నిర్వాహకుడు బండారు ఫణికుమార్‌పై కేసు నమోదు చేశారు.

కిడ్నాప్ యత్నానికి పాల్పడిన తొమ్మిది మందిపై కేసు నమోదు

కొత్తపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో తన కూతురిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారంటూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన దంగేటి వెంకటరత్నం చేసిన ఫిర్యాదుతో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. కోరుమిల్లికి చెందిన వెంకటరత్నం తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఈ నెల 20న ద్విచక్ర వాహనంపై తన పుట్టినిల్లు అయిన అంబాజీపేట మండలం ముక్కామల వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం కోరుమిల్లి బయల్దేరారు. కొత్తపేట సాయిబాబా గుడి సమీపానికి వచ్చేసరికి కోరుమిల్లికి చెందిన పోలిశెట్టి కృష్ణ అనే యువకుడు మరో ఎనిమిది మందితో కలిసి వారిని అడ్డగించి కుమార్తెను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. వారు కిడ్నాపర్ల నుంచి విదిలించుకుని కోరుమిల్లి వెళ్లి గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. వారి సూచన మేరకు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేంద్ర చెప్పారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పశుపోషణతో మరింత ఆదాయం

» ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
» అఖిల భారత పశుగణన పోస్టర్ ఆవిష్కరణ



బిక్కవోలులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయంతో పాటు పశుపోషణ ద్వారా మరింత ఆదాయం సమకూర్చడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. బిక్కవోలు పశువైద్యశాలలో శుక్రవారం ఆయన 21వ అఖిల భారత పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంత రం రాష్ట్రీయ గోకుల్‌మిషన్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేసినపశు గర్భకోశ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిబిరంలో 74 పశువులకు పరీక్షలు జరిపి మందులు అంద జేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి టి.శ్రీనివాసరావు, ఏడీఏ వై.శ్రీనివాసరావు, బిక్కవోలు పశువైద్యాధికారి ప్రణీత్, కూట మి నాయకులు పల్లి శ్రీనివాసరె డ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, బేరా వేణమ్మ, వైదాడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

అనపర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులతో శుక్రవారం అనపర్తిలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అధికారులను ఒత్తిళ్లకు గురి చేసి వారితో తప్పులు చేయించడం వంటివి కూటమి ప్రభుత్వంలో ఉండవన్నారు.

భూముల రీసర్వేకు 57 దరఖాస్తులు

బిక్కవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెంలో శుక్రవారం సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో రైతులు 57 దరఖాస్తులు అందజేశారు. సభలో ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, పడాల రామారెడ్డి, డీటీఆర్, ఆర్ఐ రవి కుమార్, సర్వేయర్ కుమారి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

» పల్లె పండుగలో ఎమ్మెల్యే గోరంట్ల
» ధవళేశ్వరంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



ధవళేశ్వరం, సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందుతేనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధవళేశ్వరంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పలు అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పడకేసిందని, నిధులు లేక పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. అలాగే స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయనకు వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో ఆసుపత్రిలో నిర్మించిన మరో భవనంలో రోగులకు అవసరమైన బెడ్‌లు లేవని తెలుసుకుని బెడ్స్ ఏర్పాటు చేస్తున్నామని హామీ ఇచ్చారు. స్థానిక ఎర్రకొండ హైవే స్కూల్ సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాసరెడ్డి సమకూర్చిన టేబుళ్లు, కుర్చీలను ఎమ్మెల్యే గోరంట్ల అంగన్‌వాడీ కేంద్ర సిబ్బందికి అందజేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పండూరి అప్పారావు, మచ్చేటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, యర్రమోతు ధర్మరాజు, తలారి మూర్తి, ఆళ్ల ఆనందరావు, పిన్నంటి ఏకబాబు, యడ్ల మహేష్, వైద్య ఆరోగ్య శాఖ డీఈ ఎం.మను, ఏఈఈ సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

వీడియోలు తయారు చేసే నైపుణ్యాలు పెంచుకోవాలి

ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం వీడియోలను మాత్రమే చూడడం కాకుండా వాటిని తయారు చేయడం, ఉపయోగించడంలో నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విజన్ టూ వీడియో, స్టూడెంట్ వీడియో ప్రొడక్షన్ అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకుడు డి.చెన్నకేశవరావు, ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు బి.వెంకటరావు మాట్లాడారు. బి.ప్రతిమ కన్వీనర్‌గా వ్యవహరించారు. వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి పీవీవీ సత్యనారాయణ, అకడమిక్ కో ఆర్డినేటర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ వెండింగ్ జోన్స్ గుర్తించాలి

రాజమహేంద్రవరం టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వీధి వ్యాపారులను గుర్తించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వారు వ్యాపారాలను నిర్వహించుకొనేలా స్ట్రీట్ వెండింగ్ జోన్స్ గుర్తించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ కార్యకలాపాలపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. మెప్మా విభాగం గతంలో వీధి వ్యాపారులను గుర్తించడం కోసం సర్వే నిర్వహించారని వారి వద్ద వివరాలు తీసుకొని వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు వారు తమ వ్యాపారాలను నిర్వహించేందుకు వెండింగ్ జోన్స్ గుర్తించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిర్వహించడం కోసం వెండింగ్ జోన్స్ గుర్తించాలన్నారు. వ్యర్థాలను కార్పొరేషన్ నిర్దేశించిన చోట మాత్రమే వేయాలని, రోడ్‌మీద వేయకుండా చూడాలన్నారు. ఇసుక, ఇటుకలు రోడ్డుకు అడ్డంగా వేయకుండా ప్లానింగ్ సెక్రటరీ నిరంతరం పర్యవేక్షించాలని, ఒకవేళ ఎవరైనా వేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ప్లానింగ్ కార్యదర్శులు, డీపీఎంఎస్ సైట్లో అన్ని పార్టుఫాల్స్ వెంటనే క్లియర్ చేయాలన్నారు. నగరంలో ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు తొలగించే కార్యక్రమం కొనసాగించాలని ఆదేశించారు. రాబోయే గోదావరి పుష్కరాల దృష్ట్యా విమానాశ్రయం నుంచి పుష్కరఘాట్ రోడ్డు వరకు ఉన్న ఆక్రమణలపై దృష్టి సారించాలన్నారు. నగరంలోని సర్వే నిర్వహించి అధికార ,అనధికార హోర్డింగులు గుర్తించి నివేదిక తయారు చేయాలని, దాని ఆధారంగా అనధికార హోర్డింగులు క్రమబద్ధీకరించి ప్రకటన పన్నులు వసూలు చేయాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ కోటయ్య, డీసీపీ సత్యనారాయణరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
» నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయనిధి అందజేత



బాధితులకు సీఎం సహాయనిధి నుంచి విడుదలైన ఎల్‌వోసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యం బారిన పడి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి విడుదలైన నగదు పత్రాలను రాజమహేంద్రవరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు తానెప్పుడూ సేవకుడిగానే పనిచేస్తానన్నారు. రాజానగరం మండలంలో రూ.3.75 లక్షలు, సీతానగరం మండలంలో రూ.82 వేలు, కోరుకొండ మండలంలో రూ.2.94 లక్షల నగదు చెక్కులను అంద జేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు బస్సు సర్వీసు ప్రారంభం

కోరుకొండ, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి- గోకవరం బస్టాండ్ నుంచి కోరుకొండ మీదుగా గోకవరం వెళ్లేందుకు శుక్రవారం కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతన బస్ సర్వీసును ఎమ్మెల్యే బలరామకృష్ణ ప్రారంభించారు. కొన్ని నెలలుగా సరైన బస్సు సౌకర్యం లేక మహిళలు, విద్యార్థులు, రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే. ఆర్టీసీ ఉన్నతాధికారులతో సంప్రదించి నూతన బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. బస్సులో ఎమ్మెల్యేతో పాటు, ఆయన సతీమణి వెంకటలక్ష్మి టిక్కెట్ తీసుకుని ప్రయాణించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

» రాజమహేంద్రవరం ప్రథమస్థానంలో నిలవాలి » ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 25: సభ్యత్వ నమోదులో మనమంతా ప్రథమ స్థానంలో నిలవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరిలో శుక్రవారం టీడీపీ సభ్యత నమోదుపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ నెల 27నుంచి రాజమహేంద్రవరంలో సభ్యత నమోదు కార్యక్రమం ప్రారంభమౌతుందని, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. నాయకులు, కార్యకర్తలందరి సమస్యలు పరిష్కరిస్తామని , అందరూ సమష్టిగా ఉ టూ సభ్యత్వ నమోదు చేయాలన్నారు. అలాగే శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, యర్రా వేణుపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్ మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం కలిగిన ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. గత సీఎం జగన్ రాష్ట్రంలో వ్యవస్థలను నాశనం చేశాడని మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై పోరాటం

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నా శ్రమదోపిడీకి గురవుతున్నారని, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైనంతమంది పారిశుధ్య కార్మికులు లేరన్నారు. జనాభా పెరిగినా కార్మికుల సంఖ్య పెంచడంలేదని, దీంతో ఉన్నవారిపైనే పనిభారం తీవ్రంగా పెరిగిందని అన్నారు. రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానంలో కొత్త రిక్రూట్‌మెంట్లు లేకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు తదితరులు మాట్లాడారు. అంతకుముందు రెల్లిపేట నుంచి తాడితోట కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, యూనియన్ నాయకులు దుర్గమ్మ, అల్లం వెంకటేశ్వరరావు, మురళి, శారద పాల్గొన్నారు.

నూతన పాలసీతో రాష్ట్రంలో మద్యం ఏరులు

» ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల » రాజానగరంలో ధర్నా



ధర్నా, ప్రదర్శన చేస్తున్న ఏపీఆర్‌సీఎస్ సభ్యులు

రాజానగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీతో రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆరోపిం చారు. సమాజాన్ని నాశనం చేస్తున్న మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజానగరంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీతో రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలు, ఆసుపత్రులు, ప్రధాన రహదారుల చెంతన మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. బెల్టు షాపులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. మద్య పానాన్ని నిషేధిస్తామని హామీ ఇచ్చి, రేట్లు పెంచి సొంత బ్రాండ్లు అమ్మిన గత ప్రభుత్వాన్ని విమర్శించి అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి సమాజాన్ని మరింత నాశనం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్ టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, రాయుడు కన్నబాబు, ముసలిబాబు, భూషణం, సత్తిబాబు, దాకే సత్తిబాబు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ భరత్‌రామ్‌కు ఇంగిత జ్ఞానం లేదు

టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డిమణి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 25: మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు ఇంగిత జ్ఞానం లేదు గనకనే అతన్ని రాజమహేంద్రవరం ప్రజలు చిత్తుగా ఓడించారని టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు ధ్వజమెత్తారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. మోరంపూడిలో అంత ఫ్లైఓవర్ కట్టించిన కూటమి ప్రభుత్వానికి తాను చెప్పే వరకు లైట్లువేయించలేకపోయారని భరత్‌రామ్ అనుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఫ్లైఓవర్ కాంట్రాక్టరు తన స్థలంలో రోడ్డు వేస్తేనే కాని అతని పరికరాలు తీసుకోనివ్వకుండా తాళాలు వేసుకున్న భరత్ ఫ్లైఓవర్ కోసం మాట్లాడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఫ్లైఓవర్ వచ్చిన సంగతి ప్రజలందరికి తెలుసునన్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అంకితభావంతో పనిచేస్తున్నారని ఆయన్ను చూసి భరత్‌రామ్ తట్టుకోలేకపోతున్నారన్నారు. సమావేశంలో కడలి రామకృష్ణ, కోరుమిల్లి విజయశేఖర్, టి.బాబి, మొకమాటి సత్యనారాయణ, పాలవలస భద్రం, మరుకుర్తి రవియాదవ్, అడ్డగర్ల ఆనంద్, మహబూబ్ జానీ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

ధవళేశ్వరం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా 59 మంది నిరుద్యోగులు పాల్గొన్నారని జిల్లా నైపుణ్యాధికారి గంటా సుధాకర్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా 17 మందికి ఉద్యోగవకాశాలు కల్పించామని తెలిపారు కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి హరీష్ చంద్రప్రసాద్, ఐటీఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్, కళాశాల ట్రైనింగ్ అధికారి విష్ణుబాబు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జి.సురేష్, జిల్లా నియామక అధికారిణి డి.పావని ప్రియ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

చాగల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ ఐపీవో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మహిళ సమాఖ్య కార్యాలయంలో గ్రామ స్థాయి వీవోఏలు, ఏపీఎం, సీసీలు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు పారిశ్రామిక రంగంలో రాణించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధి శ్రీనివాసరావు, డీపీఎం హేమంత్, ఏపీఎం ఎం.శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

రేపు సంతాన సాఫల్య ఉచిత వైద్య శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బాంధవి

అనపర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని సీడీఆర్ ఆసుపత్రిలో ఈనెల 27న సంతాన సాఫల్యత ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆసుపత్రి ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ కర్రి బాంధవి తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనపర్తిలో నిర్వహిస్తున్న ఐవీఎఫ్ సెంటర్‌లో సంతాన లేమితో బాధపడుతున్న వారికి ఫర్టిలిటీ త్రీడీ స్కానింగ్‌ను ఉచితంగా నిర్వహించాలని ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 97381 34567 నెంబరులో సంప్రదించాలన్నారు. సమావేశంలో వైద్యులు తేతలి అరుణాదేవి, ఎస్.ఆశ నిర్మల పాల్గొన్నారు.

జానపద కళాకారులకు బకాయిలు చెల్లించాలి

జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జానపద కళాకారులకు గ్రామదర్శిని, నగర దర్శిని ప్రోగ్రామ్‌ల నిమిత్తం రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కలసి వినతిపత్రం అందజేశారు. అర్హులైన కళాకారులకు పింఛన్లు అందజేయాలని, వచ్చే నెల 8న జరిగే జానపద కళాకారుల సభకు రావాల్సిందిగా ఎమ్మెల్యేను ఆహ్వానించామని రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన జానపద కళాకారులు పాల్గొన్నారు.

గైట్ డిగ్రీ కళాశాలలో ముగిసిన ఉచిత దంత వైద్య శిబిరం



రాజానగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గైట్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం శుక్రవారం ముగిసింది. ఈశిబిరంలో జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలకు చెందిన వైద్యులు పాల్గొని 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 68 మందికి చికిత్సలు అందించారు. ఈకార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వల్లీ మాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.కాశీకృష్ణ, జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ గంటా సునీల్, హెచ్‌వోడి రూపేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

స.హ.చను సక్రమంగా వినియోగించుకోవాలి

అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఇమామి ఖాసిం

రాజానగరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని(స.హ.చ) సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు పిలుపునిచ్చారు. సమాచార హక్కు చట్టం 2005పై మండల స్థాయి అవగాహన కార్యక్రమం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాధవరావు మాట్లాడుతూ రైతులకు కూడా స.హ.చపై అవగాహన కల్పిస్తున్నామని, దీనిని ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం స.హ.చ విధి విధానాలు, ఏవిధంగా వినియోగించుకోవాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్, మండల ఉద్యానశాఖాధికారిణి దివ్యశ్రీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో సత్తాచాటిన ఎస్‌పీఎఫ్



ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న ఎస్‌పీఎఫ్ క్రీడాకారులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 25: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం 33వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 20నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాజమహేంద్రవరం ఎస్‌పీఎఫ్ బృందం సత్తా చాటింది. వివిధ క్రీడల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుంది. ఈ క్రీడాఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర హోంమంత్రి అనిత విచ్చేశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలో శుక్రవారం కమాండెంట్ కొండా నరసింహరావు తమ కార్యాలయంలో క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పీవీఎస్ ఏడీ ప్రసాదరావు, బి.శ్రీనివాసరావు, ఒ.కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన ఎస్పీ కిషోర్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 25: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తొలిసారిగా ఆ హోదాలో శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్పీ నరసింహకిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి స్వాగతించారు.

నటి సూర్యకాంతం శత వర్ధంతి



సూర్యకాంతం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అత్తగారి పాత్రను అవలీలగా నటించి జీవించిన ప్రముఖ నటి సూర్యకాంతం శత వర్ధంతిని స్థానిక అశోకా థియేటర్ ఆవరణలో అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి అక్కినేని ఫాన్స్ అధ్యక్షుడు హెచ్ఎస్ ఆనంద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తెలుగు సినీ రంగంలో సూర్యకాంతం నటవైభవాన్ని తెలుగు ప్రజలు చిరకాలం గుర్తుంచుకొంటారని, అత్తగారి పాత్రలో ఆమె చూపించే నటనా వైదుష్యం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సన్నిరెడ్డి శ్రీనివాసరావు, ఎం.శేషగిరిరావు, నిమ్మలపూడి గోవిందు, సూర్యకాంతం అభిమానులు పాల్గొన్నారు.



అక్షరాస్యత పెంచాలి : గోపీకృష్ణ

చాగల్లు, అక్టోబరు 25 : అక్షరాస్యత పెంచాలని ఓపెన్ స్కూల్ రాష్ట్ర పరిశీలకుడు గోపీకృష్ణ అన్నారు. చాగల్లు హైస్కూల్‌ను శుక్రవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.మీ తల్లిదండ్రులు చదువుకునే విధంగా మీరే వారికి చెప్పాలన్నారు.గతంలో ఓపెన్ స్కూల్స్‌లో అడ్మిషన్లు బాగుండేవన్నారు. ఈ కార్యక్రమంలో ఓపెన్‌స్కూల్ ఇన్‌చార్జి పి.సత్య నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్యమే.. మార్గంగా!



వైసీపీ రహస్య సిండికేట్

- కూటమితో జతకట్టిన ఫ్యాన్
- మద్యం దుకాణాల్లో బినామీలు
- జనసేన ముసుగులో లాటరీ
- ఇప్పుడిప్పుడే బయటకు..
- కూటమిలో కుమ్ములాటలు
- జిల్లాలో సీనియర్ల అసంతృప్తి
- నాయకులకు సర్దుపాట్లు

(రాజమహేంద్రవరం/సిటీ-ఆంధ్రజ్యోతి)

కూటమి కింద మెల్లమెల్లగా ఫ్యాన్ రెక్కలు చేరుతున్నాయి.. కొంత మంది అడ్డదారులు వెతుక్కుంటుంటే..మరికొంత మంది మాత్రం డైరెక్ట్‌గా కూటమి నాయకుల పంచన చేరుతున్నారు. దీనికి మద్యం వ్యాపారమే మార్గంగా ఎంచుకున్నారు.జిల్లాలోని 125 మద్యం షాపులను నోటిఫై చేయగా ఏకంగా 4,384 దరఖాస్తులు అందాయి. కొందరు కలిపి సిండికేట్‌గా కూడుకొని వందల్లో దరఖాస్తులు సమర్పించారు. లాటరీ ద్వారా షాపులు కేటాయించారు.అయితే వైసీపీ నాయకులు కొందరు బినామీలతో దరఖాస్తు చేయించారు. నేరుగా వైసీపీ నాయకులు పాల్గొంటే ఇబ్బందులెదురవుతాయని ఊహించి దొడ్డిదారిన చక్కబెట్టారు. దీనికి కొందరు టీడీపీ, జనసేన నాయకులను వాడుకొన్నారని తెలుస్తోంది. దరఖాస్తులు బినామీల పేరున సమర్పించి వైసీపీ నాయకులు దరఖాస్తు ఫీజు సమకూర్చినట్టు చెబుతున్నారు.షాపులు వచ్చిన తర్వాత తెరపైన టీడీపీ,జనసేన నాయకులు కనిపించినా.. తెర వెనుక కొందరు లోపాయికారిగా వైసీపీకి సహకారం అందించి వ్యాపారంలో వాటాలు ఇస్తున్నా రనే చర్చ నడుస్తోంది. కూటమి నాయకుల మధ్య చిచ్చు పెట్టి వ్యాపారం పూర్తిగా వైసీపీ నాయకులు చేతిలో పెట్టుకొనే విధంగా పావులు కదుపుతున్నట్టు సమాచారం.

బినామీలు.. వైసీపీ నాయకులే!

నిడదవోలులోని మద్యం సిండికేట్‌కి ఓ వైసీపీ నాయకుడు సారథ్యం వహిస్తున్నారు.ఈయన కనుసన్నల్లోనే వ్యాపారం జరుగుతోంది. రాజమహేంద్రవరం పేపర్‌మిల్, గోరక్షణపేట ఏరియాల్లోని 6, 20 మద్యం దుకాణాల్లో మాజీ ఎంపీ భరత్‌రామ్ బినామీల ద్వారా పెట్టుబడి పెట్టడంపై సిండికేట్‌లో రగడ మొదలైంది. సిండికేట్‌లో ఉన్న ఇద్దరి ద్వారా ఇతర సభ్యులకు తెలియకుండా రహస్యంగా పెట్టుబడి పెట్టారు. షాపులు తెరిచి అమ్మకాలు ప్రారంభించిన తర్వాత ఈ విషయం ఇతర సభ్యులకు తెలియడంతో సిండికేట్‌లో ఆ ఇద్దరి వ్యవహారంపై చిచ్చు రగులుకొంది. నగరం పరిధిలోని 28 షాపులకు సిండికేట్లకు 16 దక్కాయి. వీటిని స్థానిక, స్థానికేత రులు వాటాలు వేసుకున్నారు. సిండికేట్‌లో లేకుండా లాటరీలో విజయం సాధించిన వాళ్లను ఇప్పటికే వైసీపీ దువ్వేసింది. స్థానికేతరులకు సిండికేట్ కంటే ఎక్కువగా సొమ్ములు ఆఫర్ చేయడం ద్వారా షాపులను దక్కించుకొందని తెలుస్తోంది. కొవ్వూరు రూరల్‌లోని కూడా మద్యం షాపుల్లో వైసీపీ నాయకుల పెట్టుబడులు ఉన్నాయని చెబుతున్నారు. కొవ్వూరు టౌన్‌లోని ఓ బార్ వైసీపీ నాయకుడే నడుపుతున్నారు. అలాగే మిగతా నియోజకవర్గాల్లో కూడా మద్యం వ్యాపారంలో జనసేన నాయకుల ముసుగులో వైసీపీ నాయకులు ఉన్నారని సమాచారం.

రహస్యంగా పెట్టుబడులు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో వైసీపీ నాయకులే మద్యం వ్యాపారం వెలగబెట్టారు. దాడులు, బెదిరింపులకు దిగి ఏకంగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం తయారీ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, నాసిరకం మద్యాన్ని ఏరులై పారించారు.ఈ విధంగా ఐదేళ్లపాటు టీడీపీ, జనసేన నాయకులను ఆర్థికంగా విపరీతంగా కష్టాలు పెట్టారు. దీంతో ఇప్పుడు వైసీపీ నాయకులు మద్యం వ్యాపారంలో రహస్యంగా పెట్టుబడులు పెట్టడం కూటమి నాయకులు కొందరు కమీషన్లకు ఆశ పడి లోపాయికారిగా లొంగిపోవడంపై మిగతా నాయకులు మండిపడుతున్నారు.ఈ క్రమంలో షాపులు తెరుచుకొన్న కొద్ది రోజులకే సిండికేట్లలో వైసీపీ నాయకుల వల్ల గొడవలు ఆరంభమయ్యాయి. వైసీపీ నాయకులు బినామీలతో దరఖాస్తులు సమర్పించిన వాటిలో కొన్నిటికి దుకాణాలు దక్కడంపై కూడా వాగ్వాదాలు జరుగుతున్నాయి.

కూటమిలో కుమ్ములాటలు

కూటమిలోని టీడీపీ, జనసేన నాయకుల మధ్య మద్యం వ్యాపారం విషయంలో కుమ్ములాటలు రచ్చకెక్కుతున్నాయి. వీరిలో వైసీపీకి తెరవెనుక కొమ్ముకాసే కొందరు నాయకులు టీడీపీ, జనసేన ముసుగు వేసుకొని వ్యవహారం నడిపిస్తున్నారు. సీతానగరం మండలంలోని సీతానగరం, చినకొండేపూడిలో రెండు చోట్ల టీడీపీకి చెందిన వారికి షాపులు వచ్చాయి. వాటిలో వ్యాపారం మొదలు పెట్టారు. గురువారం రాత్రి కొందరు జనసేన పార్టీకి చెందిన వాళ్లు ఆ మద్యం దుకాణాల్లో తమకు 25 శాతం వాటా ఇవ్వాలని వాదనకు దిగారు. మద్యం విక్రయాలు ఆపేస్తామంటూ షాపు షట్టర్లను దించేశారు. తర్వాత జనసేన ప్రతినిధి కల్పించుకొని సర్దుబాటు చేసినట్లు చెబుతున్నారు.కాసేపటి తర్వాత మద్యం అమ్మకాలు మొదలయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్‌లో ఓ ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో 'వాని' చక్క బెట్టగా.. 'మజ్జి'లో ఓ మహిళా నాయకురాలు కీరోల్ పోషించిందని అంటున్నారు. రూరల్ పరిధిలోని రెండు మండలాలు, సిటీలోని రూరల్ వార్డుల్లో చక్రం తిప్పి కూటమికి చెందిన నాయకులతో పాటు వారి అనుచరులకు బాగా కలిసొచ్చేలా చేశారు. ఇక్కడ కూడా సిండికేట్ వ్యవహారం బాగా నడిచింది.అయితే ముందు నుంచీ పార్టీని నమ్ముకొని ఉన్న కొందరికి తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో అసంతృప్తి నెలకొంది.పంచాయితీలు సర్దుబాటు చేయలేక నాయకులు తలలు పట్టు కుంటున్నారు.తమను విమర్శిస్తూనే తమకు రహస్యంగా అనుకూలంగా వ్యవ హరించాలని వైసీపీ నాయకులు బేరం మొదలుపెట్టినట్టు చర్చ నడుస్తోంది.ఈ నియోజకవర్గం లో కొందరికే సదరు ప్రజా ప్రతినిధి ప్రాధాన్యం ఇస్తారనే వాదన ముందు నుంచీ ఉంది. సిండికేట్‌లో వైసీపీ నాయకుల పెట్టుబడులపై చూసీ చూడకుండా వదిలేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.

ఆఫ్‌లైన్‌లోనూ.. ఇసుక



ఇసుక కొరత రానీయవద్దు

- నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో సరఫరా
- ఓపెన్ ర్యాంపులు తెరవండి
- ర్యాంపుల్లో నీరు తొలగించండి
- సొసైటీలకు వారానికే బిల్లివ్వాలి
- దోపిడీపై సమాచారమివ్వండి
- మంత్రి నిమ్మల రామానాయుడు
- నేడు ఇసుక సరఫరాపై సమీక్ష

రాజమహేంద్రవరం/కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గోదావరి ఓపెన్ ర్యాంపుల్లో ఇంకా నీరు ఉంటే.. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగు వకు వదిలేసి.. ర్యాంపుల్లో నీరు లేకుండా చేసి..రెండుమూడు రోజుల్లోనే ఓపెన్ ర్యాంపు ల్లో ఇసుకతీత ఆరంభించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని కొవ్వూరు మండలం వాడపల్లి, ఔరంగాబాద్, రాజమహేంద్రవరంలోని గాయత్రి ర్యాంపులను ర్యాంపులను శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. బోట్స్‌మెన్ సొసైటీ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారానికోసారి బిల్లులు చెల్లించాలని, ఇసుక తవ్వకాలు జరుపుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఇసుక బయటకు వెళ్లడం లేదన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకోవడానికి ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలన్నారు. ఇసుక రీచ్‌లలో డివైజ్‌లను, సిబ్బందిని పెంచాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పొల్యూషన్ బోర్డులు అన్ని రీచ్‌లు ప్రారంభించడానికి అభ్యంతరాలు తెలపడంతో కొన్ని రీచ్‌లే ప్రారంభించామన్నారు. పూర్తిస్థాయిలో బోట్స్‌మన్ సొసైటీలు తవ్వకాలు చేపట్టి తీసుకొచ్చిన ఇసుకను ఆన్‌లైన్, ఆఫ్లైనులో వినియోగదారులకు పంపించాలన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరంలలో ఇసుక రీచ్‌లపై ఒత్తిడి తగ్గించాలన్నారు. స్వచ్ఛందంగా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై వచ్చి ఇసుక తీసుకువెళ్లే వారికి ఇబ్బందులు, అభ్యంతరాలు సృష్టించవద్దని సీఎం చంద్రబాబు స్పష్టంగా ఆదేశించారని, అధికారులంతా పాటించాలన్నారు. గత జూన్, జూలై నెలల్లో ర్యాంపుల నుంచి తరలించిన ఇసు కకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. బోట్స్‌మెన్ సొసైటీలకు వారానికోసారి బిల్లులు చెల్లించాలని మైన్స్, కలెక్టర్‌లను ఆదేశించామన్నారు. వాడపల్లి రీచ్ నుంచి ప్రతి రోజు 5 వేల టన్నులు ఇసుక సరఫరా చేయాలన్నారు. వైసీపీ నాయకులను చూసి ఎక్కడైనా నాయకులు ఇసుకలో దోపిడీ చేయాలని చూస్తే తన దృష్టికి తీసుకురావాలని మం త్రి నిమ్మల అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వ రరావు, జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, పోలవరం సీఈ నరసింహమూర్తి, ఎస్ఈ జి.శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేనిని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, డీఎస్పీ జి.దేవకుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోట్స్‌మన్ సొసైటీలను పెంచండి

ధవళేశ్వరం ఇరిగేషన్ అతిథి గృహంలో అధికారులు, నాయకులతో మంత్రి సమీక్షించారు. ఇసుక లభ్యత బాగా పెంచాలని, బోట్స్‌మన్ సొసైటీలను పెంచి ఇసుక తీయించాలన్నారు.ఇసుకకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఆన్‌లైన్ ఇబ్బందులు ఉంటే శని వారం నుంచే ఆఫ్‌లైన్‌లో కూడా ఇసుక సరఫరా చేయాలన్నారు. వినియోగదారుడు ర్యాంపు వద్దకు వస్తే ఇసుకతీత, లోడింగ్‌కు కట్టవలసిన సొమ్ము అక్కడే చెల్లించి, ఇసుక తీసుకువెళ్లవచ్చన్నారు. పట్టాభూములు, జిరాయితీ భూముల్లో అధికారుల అనుమతితో రైతులే సొంతంగా ఇసుక తవ్వుకోవచ్చని స్పష్టం చేశారు.కొవ్వూరు ,ఇతర ర్యాంపుల్లోనూ ఇసుక తీతకు కార్మికుల కొరత ఉందని బోట్స్‌మన్ సొసైటీ నిర్వాహకులు మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీపావళి పండుగ కారణంగా పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలంతా వెళ్లిపోయారని.. పైగా ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మాత్రమే ఇసుక తీస్తున్నారని చెప్పారు. ఇసుక సరఫరా తదితర అంశాలపై శనివారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర పర్యా టక శాఖమంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి,ఎమ్మెల్యేలు సమీక్షించనున్నారు.



కొవ్వూరు మండలం వాడపల్లిలో ర్యాంపును పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు



అక్రమార్కులకు దారిదే : ముగ్గళ్ల ర్యాంపు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లలో తరలిస్తున్న తడి ఇసుక

ముగ్గళ్లలో ఇసుక అక్రమ రవాణా

సీతానగరం,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముగ్గళ్ల ర్యాం పులో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. సొసైటీ భూముల్లో తవ్వకాలు జరపడం తగదని.. ముగ్గళ్ల ర్యాంపునకు అనుమతి లేదని బీజేపీ నాయకుడు మట్టాడి వెంకట రమణ శుక్రవారం అడ్డు కున్నారు. దీంతో అక్రమార్కులు దాడిచేసి గాయపర్చారు.వైద్యసేవల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. జిల్లా బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి ఆయనను పరామర్శించి దోషులను శిక్షించాలని కోరారు. కాపలా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల వివరణ తీసుకుని సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటించడంతో ఇసుక అక్రమ రవాణాదారులు విజృంభిస్తున్నారు. మండ లంలో వంగలపూడి , సింగవరం, ములకల్లంక ర్యాంపులకు మాత్రమే అనుమతిచ్చారు. అను మతి లేని మిగిలిన ర్యాంపుల వద్ద అధికారు లను కాపలా ఉంచారు.అయినప్పటికి ముగ్గళ్ళ ఇసుక ర్యాం పు నుంచి ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. గోదావరిలో నీరు ఉన్నప్పటికి నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లతో భారీగా ఇసుక రవాణా చేసేస్తున్నారు.సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు.



నేటి నుంచి టూరిజం ఆధ్యాత్మిక యాత్ర

ఐదు దేవాలయాల సందర్శన

10

వచ్చే నెల 7న కేన్సర్‌పై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌పై వచ్చే నెల 7వ తేదీన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవంపై రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆ రోజున చేపట్టే కార్యక్రమాలపై సమీక్షించారు. కేన్సర్‌ను ముందుగానే గుర్తించడం, నివారించడం, చికిత్స చేయడం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేన్సర్‌పై ప్రజల్లో చైతన్యం పెంచాల్సి ఉందన్నారు. నవంబరు 7న రాజమహేంద్రవరం కోటగుమ్మం సెంటర్‌లో కేన్సర్ అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జక్కంపూడి విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరావు, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్ పాల్గొన్నారు.

రత్నగిరిలో కార్తీక మాస ఏర్పాట్లపై రేపు సమీక్ష

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న ప్రారంభం కానున్న కార్తీక మాసంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, స్వామివారి తెప్పోత్సవం, గిరిప్రదక్షణ ఏర్పాట్లపై ఆదివారం అన్నవరం దేవస్థానంలో సమీక్ష జరగనుంది. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, అగ్నిమాపక, విద్యుత్, ఆర్టీసీ శాఖల ఉన్నతాధికారులతో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు.



అనపర్తి-సామర్లకోట రోడ్డు పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేమగిరి-సామర్లకోట రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వేమగిరి సామర్లకోట కెనాల్ రోడ్డు మరమ్మతులకు మంజూరైన 6.33 కోట్లతో కేశవరం నుంచి బిక్కవోలు వరకు చేపట్టనున్న పనులకు శుక్రవారం అనపర్తిలో భూమిపూజ చేసి ప్రారంభించారు. కెనాల్ రోడ్డును గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేయడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే ఈ రోడ్డు అభివృద్ధికి మూడు రకాల ప్రతిపాదనలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపడం జరిగిందన్నారు. ఈ రోడ్డును జాతీయ రహదారి జాబితాలో కలిపి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇది జరిగే సరికి సుమారుగా రెండేళ్లు పడుతుందన్నారు. అప్పటి వరకూ ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు,సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ళ గోవిందు, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు,కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, శివరామ కృష్ణంరాజు,శేషారత్నం పాల్గొన్నారు.

అద్వితీయంగా పోలీస్ క్రీడాపోటీలు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో క్రీడాపోటీలు ఉల్లాసంగా సాగుతున్నాయి.ఎప్పుడు పని ఒత్తిడితో పరుగులు పెట్టే పోలీసులు గత రెండు రోజులుగా రాజమహేంద్రవరం జిల్లా పోలీస్ గ్రౌండ్స్‌లో ఆటలతో సేదతీరుతున్నారు. రన్నింగ్ తదితర క్రీడల్లో పోలీసులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వివిధ క్రీడల్లో పోలీసులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. 200 మీటర్ల రన్నింగ్ మహిళా విభాగంలో సెంట్రల్ జోన్ మహిళా కానిస్టేబుల్ ఆర్.రోహిణి (1469) ప్రథమ, కే.కన్నా (1419) ద్వితీయ, సౌత్ జోన్ నుంచి కే.రోజా (1441) తృతీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల రన్నింగ్ మహిళా విభాగంలో సెంట్రల్ జోన్ నుంచి మళ్లీ ఆర్.రోహిణి (1469) ప్రథమ, కే.భవాని (1418) ద్వితీయ, డీఏఆర్ నుంచి ఎం.జ్యోతి (4710) తృతీయ స్థానంలో నిలిచారు. 800 మీటర్ల రన్నింగ్ మహిళా విభాగంలో సెంట్రల్ జోన్ నుంచి కే.భవాని (1418) ప్రథమ, డీఏఆర్ నుంచి ఎం.జ్యోతి (4710) ద్వితీయ,సౌత్ జోన్ నుంచి కే.రోజా తృతీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పురుషుల విభాగంలో డీఏఆర్ నుంచి పి.బాపన్నదొర (పిసి627)ప్రథమ, ట్రాఫిక్ విభాగం నుంచి టి.అనిల్ కుమార్ (1387) ద్వితీయ, డిఏఆర్ నుంచి జి.సురేష్ (520) తృతీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల విభాగంలో పి.బాపన్నదొర ప్రథమ,డీఏఆర్ నుంచి కేఎస్‌వి రత్నం ద్వితీయ,సౌత్ జోన్ నుంచి పి.సతీష్ కుమార్ తృతీయస్థానంలో నిలిచారు. 4/400 మీటర్ల విభాగంలో డీఏఆర్ ప్రథ మ, ట్రాఫిక్ విభాగం ద్వితీయ, సెంట్రల్ జోన్ విభాగాల క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచారు. 800 మీటర్ల విభాగం లో నార్త్ జోన్ నుంచి ఎస్ఆర్‌డీవీ ప్రసాద్ ప్రథమ, డీఏఆర్ నుంచి వి.కమలహాసన్ ద్వితీయ, ఎం.శంకర్ తృతీయ స్థానంలోనిలిచారు. శనివారంతో క్రీడలు ముగుస్తాయి.



కబడ్డీలో తలపడుతున్న పోలీస్ క్రీడాకారులు

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

» పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారైన వైనం
» నిష్ప్రయోజనమవుతున్న దాతల సహకారం


చాగల్లులో షుగర్ ఫ్యాక్టరీ వద్ద పిచ్చిమొక్కలతో బస్‌షెల్టర్

చాగల్లు, అక్టోబరు 24: ప్రయాణికులు సేద తీరడం కోసం దాతల సహకారంతో ప్రభుత్వం నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. పిచ్చిమొక్కలు పెరిగిపోయి చూడడానికి సైతం భయపడే విధంగా తయారై అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. కాగా ఇటీవల ప్రయాణికులు సైతం ఆర్టీసీ బస్సులు వినియోగిస్తుండడంతో షెల్టర్ల అవసరం పెరిగింది. అయితే బస్సులు స్టాప్ పాయింట్లోకి రాకపోవడమో లేక ఆటోల రద్దీ పెరగడమో తెలియదు గాని షెల్టర్లు వినియోగంలో ఉండడం లేదు. కొన్ని చోట్ల షెల్టర్లు ఉన్నా చుట్టు అపరిశుభ్ర వాతావరణం ఉండడం, మొక్కలు పెరిగిపోవడంతో వాటి వద్ద ఎవరు వెళ్లడం లేదు. మండల కేంద్రమైన చాగల్లులో మూడుతో పాటుగా పంగిడి, నిడదవోలు వయా చాగల్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు పొడవున ప్రతి గ్రామంలోను బస్‌షెల్టర్ ఉంది. కరోనా అనంతర కాలంలో ఆటోలు రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో బస్సుల వినియోగం పెరిగింది. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం హామీ అమలులోకి వస్తే బస్సులు రద్దీ పెరగడం ఖాయం. అధికారులు, ప్రజాప్రతినిధులుతో పాటు ప్రజలు చైతన్యవంతలై బస్సు షెల్టర్‌లు శుభ్రం చేసి వినియోగంలోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న బస్ షెల్టర్

నేటి నుంచి ఆధ్యాత్మిక పర్యాటక యాత్ర

టూరిజం బస్సును ప్రారంభించనున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వారాంతపు ఆధ్యాత్మిక యాత్రకు శనివారం శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫిశాఖా మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్‌లో ఉన్న టూరిజం ఆర్డీ ఆఫీసు నుంచి ఉదయం 6 గంటలకు బస్సును ప్రారంభించనున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక దేవాలయాలు, పంచారామ క్షేత్రాలు సందర్శించేవారి కోసం ప్రత్యేక ప్యాకేజీ నిర్ణయించారు. తొలుత భక్తులకు ఆధ్యాత్మిక సాంత్వన కలిగించడానికి ఆరు పుణ్యక్షేత్రాలతో ఈ యాత్రకు శ్రీకారం చుడుతున్నారు.ప్రతి శనివారం యాత్ర ఉంటుంది. రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ టూరిజం శాఖ ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం(ఐఆర్‌వో) వద్ద ప్రతి శనివారం ఉదయం 6గంటలకు బస్సులు బయలు దేరతాయి. యాత్ర రాత్రి 7.30 గంటలకు ముగుస్తుంది.

యాత్ర సాగుతుందిలా..

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనంతో యాత్ర మొదలవుతుంది. అనంతరం అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోటలోని చాణుక్య కుమార రామభీమేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అక్కడ మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరి స్తారు. ఆ తర్వాత ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. చివరగా వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించు కుంటారు.

టికెట్ ధరలు ఇలా..

పెద్దలకు టికెట్ ధర రూ.1000 నిర్ణయించారు. మూడు నుంచి పదేళ్లలోపు వయస్సు గల చిన్నారులకు రూ.800 నిర్ణయించారు. శుక్రవారం రాత్రి 10 మంది యాత్రికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. ఈ బస్సులో 18 మంది యాత్రికులు ప్రయాణించవచ్చు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి దుర్గేష్

రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా ఒకరోజు ఆధ్మాతిక యాత్రను ప్రారంభిస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేల సూచన మేరకు ఈ యాత్ర ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. భక్తులను రద్దీని బట్టి బస్సులు ఏర్పాటు చేస్తామని, ఆదివారం కూడా యాత్రను కొనసాగించే ఆలోచన చేస్తున్నట్టు ఆయన తెలిపారు.


పెద్దగూడెంలో వాటర్ బాటిల్‌లో పట్టిన నీటిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ గిరి

డ్రైనేజీలో ఉన్న పైపులైన్ పరిశీలన

గోపాలపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గోపాలపురంలోని పెద్దగూడెంలో 16వ వార్డులో ఉన్న డ్రైనేజీలో ఉన్న పైపులైన్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టీవీవీ గిరి శుక్రవారం పరిశీలించారు. 'ఆ నీరు తాగితే రోగాలు రావా' శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో బోరు నుంచి సరఫరా అవుతున్న తాగు నీటి నమూనాలు సేకరించారు ఆయన మాట్లాడుతూ నీరు కలుషితం అయినట్టు నిర్ధారణ అయితే నూతన బోరు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రతను పాటించి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బంగారయ్య, ఈవో అనురాధ, ఎంఆర్‌సీ బాబురావు తదితరులు ఉన్నారు.


ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విద్యాపతి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

గోపాలపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మి రైతులు మద్దతు ధర పొందాలని తహసీల్దార్ విద్యాపతి అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో రైస్‌మిల్లర్లు, సచివాలయ, వ్యవసాయ సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై మైత్రి కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ఈ కమిటీలో తహసీల్దార్‌తో పాటు వ్యవసాయాధికారి, ఎంపీడీవో, సీఎస్‌డీటీ ఉంటారన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్లు, వీఆర్‌వోలు, వీఏఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు రెండు కంప్యూటర్ల బహుకరణ

పూర్వ విద్యార్థుల ఔదార్యం

తాళ్లపూడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం జూనియర్ కళాశాల 1986 బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం రెండు కంప్యూటర్లు అందచేశారు. ఇటీవల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరగ్గా, దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయనకు కంప్యూటర్ల అవసరాన్ని తెలిపారు. పూర్వ విద్యార్థులు స్పందించి 50 వేల విలువైన రెండు కంపూటర్లను శుక్రవారం కళాశాల ప్రిన్స్‌పాల్ గరగ శ్రీనివాస్‌కు అందించారు. పూర్వ విద్యార్థి కొలుకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలకు ఏ అవసరమొచ్చినా తమ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.రఘువీర్‌శాస్త్రి, ఇమ్మణ్ణి వీరశంకరం, వరలక్ష్మి, రామకృష్ణ డేవిడ్‌రాజు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


కళాశాల ప్రిన్సిపాల్‌కు కంప్యూటర్‌లు అందించిన పూర్వ విద్యార్థులు

రైతుల అభివృద్ధికే పశుగణన

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పశువుల రైతుల అభివృద్ధికే పశుగణన చేపట్టడం జరుగుతుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. దేశవ్యాప్తంగా అక్టోబరు 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు చేపట్టనున్న అఖిల భారత పశు గణన పోస్టర్‌ను శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. పశు గణన భవిష్యత్ ప్రణాళిక.. విధాన రూపకల్పనకు కీలకమైన సమాచారాన్ని అందిస్తుందన్నారు.కార్యక్రమంలో ద్విసభ్య కమిటి సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, పశు సంవర్ధక శాఖ కొవ్వూరు డివిజన్ ఉప సంచాలకులు డా.సుంకవల్లి సత్యనారాయణ, డా. ఎ. వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


పశుగణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

పశుగణనకు సహకరించాలి

చాగల్లు, అక్టోబరు 25 : పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేసే పశుగణన దోహదం చేస్తుందని ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు అన్నారు. దేశ వ్యాప్తంగా జరిగే 21వ జాతీయ పశుగణన కార్యక్రమం శుక్రవారం చాగల్లు పశువుల ఆసుపత్రి వద్ద ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి యు.ముఖేష్ మాట్లాడుతూ మండలంలో 11 మంది సర్వేయర్లకు రైతులు గేదెలు,ఆవులు, మేకలు తదితర పశువుల సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, టీడీపీ నాయకులు నాదెళ్ళ శ్రీరామ్, కరుటూరి సతీష్, బీజేపీ నాయకుడు గ్రంధి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 28వ తేదీ ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పథకాలపై మున్సిపల్ చైర్పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరులోని యానాది కాలనీకి చెందిన పొట్లూరి రామచంద్ర, దుర్గా దంపతుల 7 నెలల చిన్నారి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఇప్పటి వరకు తమకు ఉన్నదంతా ఖర్చుపెట్టి వైద్యం చేయించారు. ఆర్థిక స్థోమత సరిపోకపోవడంతో ఇంటి వద్దే చికిత్స చేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఉభయ గోదావరి జిల్లాల డ్యాన్సర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఆర్థిక సహకారం అందజేశారు. ప్రతిరోజు ఆక్సిజన్ అందించాలని వైద్యులు సూచించడంతో పట్టణానికి చెందిన దొడ్డా రమేష్ ఉచితంగా ఆక్సిజన్ సిలిండర్ అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ముత్యాల శ్రీనివాస్, ఎర్రన్న, బాస్కర్, చిన్ని, బాబి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు బాపూజి మృతి


బాపూజి(ఫైల్)

కొవ్వూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, ఏపీ డబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంధం పూజ్యనరసింహ బాపూజీ (బాబ్జి)(74) శుక్రవారం సాయంత్రం మరణించారు. పది రోజులుగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఇంటి వద్ద తుది శ్వాస విడిచారు. బాబ్జి మృతికి కొవ్వూరులోని వివిధ రాజకాయ పార్టీల నాయకులు, ప్రెస్ క్లబ్ సభ్యులు జీవీవీ సత్యనారాయణ, ఏఎస్ ప్రకాష్, పుప్పాల సురేష్, శ్రీరంగం సత్యప్రసాద్, కె.దాసు, ఎం.సుందర రామయ్య, గరగ వరప్రసాద్, త్రినాద్, ఎస్.శ్రీహరి, తోట అవినాష్ తదితరులు సంతాపం తెలిపారు.

కాపునాడు అధ్యక్షుడిగా ఇంటి

చాగల్లు, అక్టోబరు 25 : మండల కాపునాడు అధ్యక్షుడిగా చాగల్లుకు చెందిన ఇంటి దుర్గాప్రసాద్ నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శివనాగేశ్వరరావు నియామకపత్రం విడుదల చేసినట్టు శుక్రవారం తెలిపారు.సంఘాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.పలువురు అభినందించారు.

ఇంటర్ బాలికలకు దుస్తులు

ఉండ్రాజవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉండ్రాజవరంలో చదువుతున్న 10 మంది ఇంటర్ బాలికలకు తణుకు పట్టణానికి చెందిన సామాజికవేత్త చిట్టూరి సుజాత రెండు జతల స్కూలు యూనిఫామ్ శుక్రవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు, అధ్యాపకురాలు బూరుగుపల్లి పద్మజారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీసర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కరిస్తాం

ఉండ్రాజవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రీసర్వేలో వచ్చిన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని మండల రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్ పేర్కొన్నారు. పాలంగి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో భూ సమస్యల వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.రీసర్వేలో భూముల సమస్యలుంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జి. శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ బొక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఫ్లయ్ ఓవర్ కింద ఖాళీగా..

ఫ్లయ్ ఓవర్ కింద వాహనాలు పెడితే చర్యలు

ఇన్‌చార్జి సీఐ నాయక్

నల్లజర్ల,అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : నల్లజర్ల-పోతవరం రోడ్డులో ఫ్లైఓవర్ ప్రమాదాలకు నిలయంగా మారిందని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో డేంజర్ జోన్ అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఇన్‌చార్జి సీఐ బీఎస్.నాయక్ స్పందించారు. ఈ మేరకు ఫ్లయ్ ఓవర్ కింద ఉన్న లారీలు,దుకాణాలు, ఫ్లెక్సీలను తొలగించారు. ఎవరైనా ఫ్లయ్ ఓవర్ కింద వాహనాలు నిలిపి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. హైవేపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపరాదన్నారు.పేట్రోలింగ్ ద్వారా గస్తీ నిర్వహిస్తున్నామని,ఎవరైన ఇబ్బందులు కలిగిస్తే పోలీసులను ఆశ్రయించాలన్నారు.నల్లజర్ల-పోతవరం ఫ్లయ్‌ఓవర్ వద్ద తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని పెద్ద ఎత్తున స్పీడుబ్రేకర్లు వేసి ప్రమాదాలను అరికడతామన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

చాగల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ ఐపీవో సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మహిళ సమాఖ్య కార్యాలయంలో గ్రామస్థాయి వీవోఏలు, ఏపీఎం, సీసీలు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు పారిశ్రామిక రంగంలో రాణించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధి శ్రీనివాసరావు, డీపీఎం హేమంత్, ఏపీఎం ఎం.శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

రీసర్వేకు 57 దరఖాస్తులు

బిక్కవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెంలో శుక్రవారం సర్పంచ్ వాసంశెట్టి రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో రైతులు 57 దరఖాస్తులు అందజేశారు. సభలో ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, పడాల రామారెడ్డి, డీటీఆర్, ఆర్ఐ రవి కుమార్, సర్వేయర్ కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

ధవళేశ్వరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా 59 మంది నిరుద్యోగులు పాల్గొన్నారని జిల్లా నైపుణ్యాధికారి గంటా సుధాకర్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా 17 మందికి ఉద్యోగవకాశాలు కల్పించామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నియామక అధికారిణి డి.పావని ప్రియ, ఐటీఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్, విష్ణుబాబు,జి.సురేష్ పాల్గొన్నారు.

బస్సుల దారి మళ్లింపు

నిడదవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నిడదవోలు నుంచి నర్సాపురం వెళ్ళే బస్సులు మార్గమధ్యలో రోడ్డు మరమ్మతుల కారణంగా దారి మళ్ళించామని నిడదవోలు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నుంచి నిడదవోలు నుంచి నర్సాపురం వెళ్ళే బస్సులు, పెరవలి, ఖండవల్లి, సిద్ధాంతం, వడలి, పెనుగొండ, మార్టేరు, ఆలమూరు, నెలమూరు బ్రిడ్జి, కాపవరం, లంకలకోడేరు మీదుగా పాలకొల్లు మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

వైసీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గోపీయాదవ్ రాజీనామా

నిడదవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన గంగుల గోపీయాదవ్ తూర్పు గోదావరి జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ శాసనసభ్యుడు జి.శ్రీనివాస్ నాయుడు వ్యవహారశైలి వల్లే బీసీ సెల్ కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని వైసీపీ కేంద్ర కార్యాలయానికి, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుకు పంపినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

దేవరపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో జనసేన ముందుంటుందని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరు గ్రామానికి చెందిన పరిటాల శేఖర్ కుమారుడు కృష్ణ సతీష్ చిన్నప్పటి నుంచి ఫిట్స్‌తో బాధపడుతున్నాడని తెలిపారు. దీంతో వారి పరిస్థితిని చూసి దుద్దుకూరు జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండల నాయకుల సహకారంతో రూ. 15వేలు సతీష్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అనిశెట్టి గంగరాజు, కాట్నం గణేష్, సంబా బాల శ్రీనివాస్, పాపోలు సురేష్, పోలుమాటి నాని, కే.శ్రీనివాస్, కడియం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షి కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలి

తాళ్లపూడి, అక్టోబరు 25: షి కంప్లైట్ బాక్సులు అన్ని విభాగాల్లో ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టరు కృష్ణనాయక్‌కు వినతి పత్రం ఇచ్చామని కొవ్వూరు డివిజన్ చైర్‌పర్సన్ తాళ్లపూడి డీటీ మోహనభారతి తెలిపారు. శుక్రవారం రెవెన్యూ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్ చైర్‌పర్సన్‌గా తాళ్లపూడి టీటీ మోహనభారతి, జనరల్ సెక్రటరీగా జెడి సునీత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మోహనభారతి, సునీత మాట్లాడుతూ డివిజన్‌లోని మహిళా ఉద్యోగులు తమ సమస్యలు చెప్పిన వెంటనే తక్షణం పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ స్థాయిలోనే పరిష్కరించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుకు అక్టోబరు 2021లోపు డిగ్రీ పూర్తి చేసిన వారంతా అర్హులేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగి ఉండాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటుహక్కు పొందేందుకు అవసరమైన నిబంధనలు పాటించి ఓటుహక్కు పొందాలని దరఖాస్తులు తాళ్ళపూడి తహశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటమరణ, అల్లూరి విక్రమా ఆదిత్య, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, మాజీ ఎంపీటీసీ నాని, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పన్నులు చెల్లించని వారి నీటి కనెక్షన్ తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

పన్నులు చెల్లించకపోతే చర్యలు

మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

నిడదవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో ఇంటి, కుళాయి పన్నులు బకాయిపడిన వారిపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యానగర్, బాలాజీనగర్, గాంధీనగర్‌లలో ఇంటి, కుళాయి పన్నులు బకాయిపడిన వారి నీటి కనెక్షన్ నిలిపివేశారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలన్నారు. పన్నులు చెల్లించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బాణసంచా విక్రయ స్థలాల పరిశీలన

నిడదవోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా విక్రయించు కునేందుకు అనువైన స్థలాలను పరిశీలించి ఆమోదయోగ్య మైనదాన్ని ఎంపిక చేస్తామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలో దీపావళి బాణసంచా విక్రయాల ప్రాంతాలను పరిశీలించారు. పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ శోభన్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యాపారస్తులకు ప్రజలకు అనువైన స్థలాన్ని గుర్తించి షాపులు పెట్టుకునేందుకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. స్థలాల పరిశీలనలో ఫైర్ ఆఫీసర్ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, పలువురు అధికారులు ఉన్నారు.


బాణసంచా షాపుల స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు


పోటీలకు ఎంపికైన తాడిమళ్ళ విద్యార్థినిలు

కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిడదవోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తాడిమళ్ళ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణశాస్త్రి తెలిపారు. పాఠశాల విద్యార్థినీలు టి.దివ్యశ్రీ, కె.దివ్యహర్షిణి, ఎస్.శ్యామలాదుర్గ జిల్లా స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయికి ఎంపికవడంపై విద్యార్థినిలను వ్యాయామ ఉపాధ్యాయుడు బండి ప్రదీప్ ను పలువురు అభినందించారు.

పెరవలిలో: కానూరు జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన విద్యార్థి ఎ.సుశాంత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రామాంజనేయులు తెలిపారు. ఏలూరులో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 14 విభాగంలో ఈ విద్యార్థి ప్రతిభ చూపాడన్నారు. నవంబరు 9, 10 తేదీల్లో బాపట్ల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ వెంకట రమణ, పీడీ సుధాకర్‌ను ఆయన అభినందించారు. సర్పంచ్ భావన మధు, విద్యా కమిటీ చైర్మన్ శ్యామ్ సుందర్ తదితరులు విద్యార్థిని, ఉపాధ్యాయులను అభినందించారు.


ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర
నిడదవోలు	
వీ మ్యాక్స్	: దేవర
రాధాకృష్ణ	: వెనం
శ్రీగణపతి	: విశ్వం
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర